



హెలీప్యాడ్ ల్యాండింగ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ

ముస్తాబవుతున్న పొన్నెకల్లు

- రేపు రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాష్ట్రస్థాయి అంబేద్కర్ జయంతి వేడుకలకు సిద్ధం
- మార్గదర్శి-బంగారు కుటుంబాలతో సీఎం ముఖాముఖీ
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



సిద్ధమవుతున్న సభా ప్రాంగణం



ఏర్పాట్లను పరిశీస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

తాడికొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడులకు తాడికొండ నియోజకవర్గంలోని పొన్నెకల్లు గ్రామం ముస్తాబవుతుంది. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. దీంతో గ్రామంలో అధికారులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలోని రెండు ఎస్సీ కాలనీల మధ్యలో ముఖ్యమంత్రి సభా వేదికను నిర్ణయించిన అధికారులు ఇప్పటికే పనులు చేపట్టారు. అంబేద్కర్ వేడుకలకు సంబంధించి నాలుగు రోజులుగా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ వేడుకల్లో పీ-4 కార్యక్రమాన్ని నిర్వహించి మార్గదర్శి-బంగారు కుటుంబాలతో సీఎం చంద్రబాబు మాట్లాడనున్నారు. ఇందుకు సంబంధించి కూడా అధికారులు ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే హెలీప్యాడ్ పనులను పూర్తి చేశారు. అతిథితులకు, గ్రామస్తులకు భోజన ఏర్పాట్లకు ప్రత్యేకంగా టెంట్లను సిద్ధం చేస్తున్నారు. అంబేద్కర్ జయంతి వేడుకలను అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కూడా చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఆదివారం సాయంత్రానికి ఏర్పాట్లు పూర్తి అవుతాయని ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ శనివారం విలేకర్లకు తెలిపారు. శనివారం ఏర్పాట్లను ఆయన గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. శానిటేషన్, వాహనాల పార్కింగ్, బారీకేడింగ్ పనులు సజావుగా చేపట్టాలని అధికారులను అదేశించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, పీఆర్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీపీవో నాగసాయి, అర్అండ్‌బీ డీఈ బీ.చిన్నయ్య, తహసీల్దార్ మెహర్ కుమార్, ఎంపీడీవో సమతావాణి, ఈవోపీఆర్‌డీ సాయిలీల, పంచాయతీ సెక్రటరి జానీ పాల్గొన్నారు.

- సీఎం సభా ప్రాంగణం, హెలీప్యాడ్, అంబేద్కర్ విగ్రహం వద్ద పనులను శనివారం ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. సీఎం భద్రత సిబ్బంది, స్థానిక పోలీసులకు ఆయన పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు.

15 నుంచి వేట నిషేధం

మత్స్యకారులకు నోటీసులు

బాపట్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రాదేశిక సముద్ర జలాల్లో ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు తూర్పు బంగాళా ఖాతంలో వేట నిషేధించినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి కె. శ్రీనివాసనాయక్ తెలిపారు. వేట నిషిద్ధ కాలాన్ని కచ్చితంగా అమలు చేయడానికి మత్స్యశాఖ, కోస్ట్‌గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేట నిషేధం వల్ల చేపలు, రొయ్య జాతుల గుడ్ల సంరక్షణ, వాటి సంతతి పెరుగుదల ద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరత సాధ్యమన్నారు. మత్స్యకారులు వేట నిషేధ ఉత్తర్వులను అనుసరించి సముద్ర జలాల్లో మర, మోటారు పడవల ద్వారా చేపల వేట చేయకుండా మత్స్య అభివృద్ధికి సహకరించాలన్నారు. వేట నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే రాష్ట్ర సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం 1994 సెక్షన్ 4ను అనుసరించి శిక్షార్హులన్నారు. జరిమానాతో పాటు ప్రభుత్వం అందించే అన్ని రకాల రాయితీ సౌకర్యాలను నిలిపేస్తామన్నారు. చిన గంజాం తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లోని సొసైటీ అధ్యక్షులకు, సాగర మిత్రాలకు, గ్రామ కాపులకు, పెద్దలకు నిషేధానికి సంబంధించి మత్స్య సహాయకులు ఎస్.పుల్లారావు, డి.రామారావు, ఎస్‌కే కాలేషా, డి.ప్రతిభ, కే.ప్రమీల, నోటీసుల ద్వారా శనివారం సమాచారం అందజేశారు.

ఇంటర్‌లో.. 17వ స్థానం

- గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు
- సీనియర్లు 79, జూనియర్లు 65 శాతం ఉత్తీర్ణత
- మూడు ప్రభుత్వ కళాశాలలు నూరు శాతం ఫలితాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. శనివారం మొదటి, రెండో సంవత్సర ఫలితాలను ప్రభుత్వం విడుదల చేయగా జిల్లా 17వ స్థానం దక్కించుకుంది. జిల్లా విద్యార్థులు గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించారు. గత ఏడాది జిల్లా 14వ స్థానంలో నిలవగా ఈ ఏడాది రెండు శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించడంతో 12వ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 7,420 మంది విద్యార్థులు హాజరుకాగా 5,837 మంది ఉత్తీర్ణతతో 79 శాతం ఉత్తీర్ణత సాధించారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులు జిల్లాలో మొత్తం 9,146మంది పరీక్ష రాయగా 5,907 మంది ఉత్తీర్ణత సాధించారు. పాస్ పర్సంటేజి 65 శాతంగా నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే పాస్ పర్సంటేజీలో గణనీయంగా పెరుగుదల నమోదైంది. గతేడాది జూనియర్ ఇంటర్‌లో 60 శాతం నమోదు కాగా అది ఇప్పుడు 65 శాతమైంది. సీనియర్ ఇంటర్‌లో గతేడాది 71 శాతం కాగా ఈ సంవత్సరం అది 79 శాతానికి ఎగబాకింది. ఇక జిల్లాలోని మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఈ ఏడు నూరు శాతం ఉత్తీర్ణతను సాధించాయి. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బల్లికురవలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మొదటి, రెండో సంవత్సరం ఫలితాల్లో బాపట్లలోని డెఫ్ అండ్ డంబ్ కళాశాల, ప్రథమ సంవత్సరం ఫలితాల్లో పర్చూరు మండలంలోని నూతలపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల నూరుశాతం ఉత్తీర్ణత సాధిం చింది. చీరాల మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కె.ధాత్రిశ్రీ బైపీసీలో 975 మార్కులు సాధించింది. బాపట్లలోని ఓ ప్రైవేటు కళాశాల విద్యార్థి 989 మార్కులు సాధించారు.

పేదింట ఆణిముత్యం.. సమీరా

పర్చూరు: పర్చూరు బీఏఆర్ అండ్ టీఏ జూనియర్ కళాశాల విద్యార్థిని షేక్ సమీరా ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటింది. నిరుపేద కుటుంబంలో జన్మించిన సమీరా ఎంపీసీలో 975 మార్కులు సాధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి స్థానంలో నిలిచింది. సమీరా గుంటూరు జిల్లా పెద్దనందిపాడు మండలం కొప్పర్రు గ్రామానికి చెందిన జాన్‌బాబు, రిహానా దంపతుల కుమార్తె. కాగా స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో కూడా సమీరా 547 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. వ్యవసాయ పనులు చేసుకుంటూ కుమార్తెను ఉన్నతంగా చదివించాలన్న సంకల్పంతో నాగులపాలెంలోని పెద్దమ్మ వద్ద ఉంచి అక్కడి ప్రభుత్వ కళాశాలలో చేర్పించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన సమీరాను ప్రిన్సిపాల్ శేషకుమారి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



ప్రథమ స్థానం సాధించిన సమీరాకు స్వీట్ తినిపించి అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపాల్ శేషకుమారి, సిబ్బంది

మండిన రెంటచింతల

44.1 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత

రెంటచింతల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మంటచింతలగా పేరుగాంచిన రెంటచింతలలో శనివారం భానుడు భగ్గుమన్నాడు. తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక ఉష్ణోగ్రతకు నిలయంగా ఉన్న రెంటచింతలలో శనివారం 44.1 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. ఈ వేసవిలో ఇదే అత్యధికగా నమోదైంది. ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు సుర్రుమంటూ చెలరేగిపోయాడు. దీంతో ప్రజలు బయటకు రావాలంటే జంకారు. ఈ ఏడాది ఎండ తీవ్రత సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వడదెబ్బ నుంచి రక్షణ పొందడానికి ఎక్కువగా మంచినీటిని తాగాలని, కాటన్ దుస్తులను ధరించాలని పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.కృష్ణారెడ్డి సూచించారు.

గోవుల మృతిపై రాజకీయాలా...?

శిల్పారామం చైర్మన్ మంజులారెడ్డి



రెంటచింతల,ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని ఎస్వీ గోశాలలో 100కు పైగా ఆవులు మృతి చెందాయంటూ తప్పుడు ప్రచారాలు చేస్తూ రాజకీయం చేయడం దారుణమని శిల్పారామం చైర్మన్ చేరెడ్డి మంజులారెడ్డి అన్నారు. శనివారం రెంటాల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో మనుషులకే రక్షణ లేకుండా పోయిందని మాస్కులు అడిగినందుకు దళిత డాక్టర్ సుధాకర్ మృతి చెందడానికి కారణమయ్యారని దుయ్యబట్టారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరునితో రాజకీయాలు చేయడమంటే తమ పతనాన్ని తామే కొని తెచ్చుకుంటున్నారని అసత్య ప్రచారాలు చేయవద్దని హితవు పలికారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాన్నే కల్తీ చేసిన వ్యక్తులు ఇలాంటి ఆరోపణలు చేయడం నీచ సంస్కృతికి నిదర్శమని మండిపడ్డారు. తప్పు చేసిన వారిని శ్రీ వేంకటేశ్వరుడు వదిలి పెట్టరని వాస్తవాలు చర్చించేందుకు భూమన కరుణాకర్‌రెడ్డి ముందుకు రావాలని సవాల్ విసిరారు.పవిత్రమైన తిరుపతికి కరుణాకర్‌రెడ్డి అరిష్టంలా తయారయ్యారని దుయ్యబట్టారు. ఈమె వెంట పలువురు టీడీపీ నేతలున్నారు.



గురువుల మార్గనిర్దేశంతోనే ఉన్నతి

● పౌర సన్మానంలో కాకినాడ జేఎన్‌టీయూ వీసీ ● శివరామకృష్ణ ప్రసాద్‌కు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల సత్కారం

అమృతలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఎంతో మంది గురువులు నేర్పిన క్రమశిక్షణ, వారు అందించిన బోధన తన ఉన్నతికి దోహదపడ్డాయని కాకినాడ జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ చెరుకూరి శివరామకృష్ణ ప్రసాద్ చెప్పారు. ఇటీవల వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనను శనివారం తాను చదువుకున్న స్కూల్‌లో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు పౌర సన్మానం చేశారు. ప్రధాన రహదారి నుంచి శివరామకృష్ణ, పద్మావతి దంపతులకు మేళతాళాలతో రెడ్‌కార్పెట్ స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఉపాధ్యాయుడు కె.నిరీక్షణరావు అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ తల్లిదండ్రులు, బంధువుల ప్రభావం తనపై ఉందని, ఎక్కడ క్రమశిక్షణ వీడకుండా ఈ స్థాయికి చేరానన్నారు. విద్యార్థులంతా పట్టుదల, ప్రణాళికతో ముందుకు వెళ్లి జీవితంలో అగ్రస్థానం చేరాలని చెప్పారు. విద్యార్థి దశలో కాలాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే నైపుణ్యాలను ప్రతి ఒక్కరూ పాటించాల్సి ఉందన్నారు. ఆయన తల్లిదండ్రులు వెంకటసుబ్బమ్మలకు ఈ సందర్భంగా పాదపూజ చేశారు. గ్రామస్థులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు 1978-79 బ్యాచ్ విద్యార్థులు శివరామకృష్ణప్రసాద్, పద్మావతి దంపతులకు గజమాల వేసి పట్టువస్త్రాలు సమర్పించి ఘనంగా సత్కరించారు. ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్, ఎంటీసీసీ వల్లికారాణి, మదనమోహనరావు, వెంకటరత్నం, వినయ్ ప్రసంగించారు హైస్కూల్ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.



వీసీ శివరామకృష్ణ ప్రసాద్, పద్మావతి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకృష్ణదేవరాయులుపై విమర్శలు చేస్తే ఊరుకోం

పిన్నెల్లిపై విరుచుకుపడ్డ ఎమ్మెల్యే జూలకంటి

మాచర్లటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సుద్దపూస మాటలు ఆపు పిన్నెల్లి అంటూ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి విరుచుకుపడ్డారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి కాముకుడైన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులను అత్యంత అవినీతిపరుడు అని కబ్జాకోరైన రామకృష్ణారెడ్డి అనడం విడ్డూరంగా ఉందన్నారు. పల్నాడు అభివృద్ధికి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి అహర్నిశలు పాటుపడుతుంటే ఆయనపై విషప్రచారం చేస్తూ బురద రాజకీయాలకు తెరతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుపై విమర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. జెర్రివాగు జలాలను రైతులకు ఇవ్వకుండా దగా చేసి స్వగ్రామమైన కండ్లకుంటలో నీటి వ్యాపారం చేసే నీవా శ్రీకృష్ణదేవరాయలును విమర్శించేది అని ప్రశ్నించారు. వరికపూడిశెల పూర్తి చేయకుంటే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న నీవు సిగ్గు లేకుండా ఏ మొహం పెట్టుకుని రాజకీయం చేస్తున్నావని మండిపడ్డారు. మాచర్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విద్వేషాలు రెచ్చగొట్టేలా రాజకీయాలు చేస్తున్నారని జూలకంటి అన్నారు. అనేక కేసులు, అవినీతి ఆరోపణలు ఎదు ర్కొంటున్న పిన్నెల్లి మాటలు విని రెచ్చిపోతే ఆయనతోపాటు నాయకులు సైతం జైలు పాలు కాక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, బీసీ జిల్లా అధ్యక్షుడు మున్నా రాంబాబు, బూసా వేణు, వాసు, కొమెర శివ పాల్గొన్నారు.

అమరేశ్వరాలయం సహాయ కమిషనర్‌గా రేఖ



అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయం సహాయ కమి షనర్‌గా కర్రెద్దుల రేఖ శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరిం చారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం రేఖ అమరేశ్వరాలయ సహాయ కమిషనర్‌గా నియమించబడింది. గతం లో ఇన్‌చార్జిగా పనిచేసిన పీ సునీల్‌కుమార్ తన మాతృసంస్థ అయిన దుగ్గిరాల మండలం కంతంరాజు కొండూరులోని మహం కాళీ అమ్మవారి ఆలయంలో ఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన రేఖకు ఆలయ అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం

కారంపూడి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేర్వేరు వాహనాలపై ఉంచి ఎదురుకోల ఉత్సవం జరిపారు. బ్రహ్మనాయుడు ఆయుధమైన నృసింహకుంతాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొమండూరి సత్యనారాయణాచార్యులు మంగళసూత్రధారణ, ముత్యాల తలంబ్రాలు ఘట్టాలను నిర్వహించారు.



శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

గుంటూరు నుంచి నడిచి వచ్చి

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం



టీటీడీ చైర్మన్‌కు డీడీ అందజేస్తున్న శ్రీనివాసరావు

తిరుమల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు శనివారం రూ.కోటి విరాళంగా అందింది. విశాఖకు చెందిన మైత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ మైనింగ్ కంపెనీ చైర్మన్ శ్రీనివాసరావు గుంటూరు నుంచి 12 రోజుల పాటు పాదయాత్రగా తిరుమలకు వచ్చి ఈ విరాళాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు శనివారం అందజేశారు.

దర్శకుల సృష్టి కోటప్పకొండ చిత్రం

◆ ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట కల్చరల్, ఏప్రియల్ 12 (ఆంధ్రజ్యోతి). దర్శకుల సృష్టి కోటప్పకొండ చిత్రమని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం రాత్రి స్థానిక భువనచంద్ర టౌన్‌హాల్‌లో జరిగిన సినిమా ఓటీటీ సక్సెస్ మీట్‌లో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కోటప్పకొండ స్థల పురాణాన్ని దృశ్య రూపంగా చిత్రీకరించిన దర్శకులను అభినందించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 25 లక్షల మంది వీక్షించడం రికార్డుగా పేర్కొన్నారు. సినీ దర్శకులు మా ఏపీ వ్యవస్థాపకులు దిలీప్ రాజా మాట్లాడుతూ తన దగ్గర శిక్షణ పొందిన తన శిష్యులు తొలి ప్రయత్నంగా నిర్మించిన ఈ చిత్రాన్ని 25 లక్షల మంది వీక్షించడం తనకు గర్వకారణమన్నారు. దీని వెనుక నటీనటులు, సాంకేతిక నిపుణుల కృషి ఎంతైనా ఉందన్నారు. తొలుత ఎమ్మెల్యే యూనిట్ బృందాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దర్శకులు నరేష్ దోనే, మణివరన్, కోఆర్డినేటర్ రజియా, కాస్ట్యుమ్ డిజైనర్ పట్నాల పార్వతి, నటులు ఈదర అమర్‌నాథ్, నిర్మాత రావూరి సురేష్ బాబు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీ చైతన్య ప్రభంజనం

గుంటూరు (విద్య) ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ బోర్డు ప్రకటించిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో ఎం వినూత్న 467, ఎస్.కె బుష్రా అంజుమ్, ఎస్.కె గౌస్ ఆజాం, కే శరణ్య కే శ్రీ నిధి పీ సౌమ్య తదితరులు 466 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 465 మార్కులకు పైగా 37 మంది 464 మార్కులకు పైగా 70 మంది, 460 మార్కులు పైగా 838 మంది, 450 పైగా మార్కులతో 2357 మంది, 400 పైగా మార్కులతో 5219 మంది ఉత్తీర్ణత సాధించారు. బైపీసీ విభాగంలో ఏ రమ్య, ఏ గాయత్రి, ఆర్ గీతిక, టీ లీలాభవాని, సాయి వాసంతి, ఎం సుప్రజా, వి సంధ్య ,ఎస్.కె నఫీసా ,ఎం రత్నశ్రీ, ఆర్ తేజస్విని తదితరులు 435 మార్కులు సాధించారు. బైపీసీలో 430పైగా 154 మంది, 420 మార్కులకు పైగా 222మంది, 400 మార్కులకు పైగా పైగా 557 మం ది సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో టీ శరణ్య 991 మార్కులు ఆర్ చంద్రశేఖర్ 990, ఎం బాలాజీ, కే ప్రేరణ 989 మార్కులు, కే ఉషారాణి 988, శ్రీవిద్య 987 మార్కులు సాధించారు. 980పైగా 471 మంది, 970పైగా మార్కులు 815 మంది, 950పైగా మార్కులు 1752 మంది, 900 పైగా మార్కులతో 3915 మంది సాధించారని ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ విశ్లేషించారు. విద్యార్థులను డీన్స్ కిషోర్‌కుమార్, చంద్రశేఖర్, సురేష్‌కృష్ణ, అసోసియేట్ డీన్ హరిబాబు తదితరులు అభినందించారు.



విద్యార్థులతో శ్రీచైతన్య ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ తదితరులు

శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ అన్నా నందకిషోర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీలో జీ వంశీప్రియ, సీహెచ్ తన్మయి 491, కృష్ణచైతన్య 490, వై యుక్తయువరాణి 489, ఎంఎల్‌వీఎన్ యశస్విని 489, వై తన్వీశ్రీ, ఎస్ మేఘన 488, సీఈసీలో కే సర్వంత్ సైనా 458 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంఈసీలో ఆర్ యోమిత, ఎన్‌వీ కౌశిక్‌సాయి 979, వీజే సాయిశ్రీయ 975, కే వైసిల్యా 972 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి శ్రీలక్ష్మీ తదితరులు అభినందించారు.



విద్యార్థులతో శ్రీమేధ చైర్మన్ అన్నా నందకిషోర్

నారాయణ విజయభేరి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని డీజీఎం శ్రీనివాసులురెడ్డి, కోర్ డీన్ తార్నాక చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 470కి గానూ షేక్ కరిష్మా 466 మార్కులు సాధించారు. ఎండీ ఖయ్యూం, ఎస్‌వీ కార్తీక్, 465 మార్కులు సాధించారు. 464పైగా మార్కులు 42 మంది, 463 మార్కులకుపైగా 82 మంది, 462 మార్కులకుపైగా 111 మంది సాధించారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో సీహెచ్ మహాలక్ష్మీ, ఎస్ తహసిన్, సీ సైమా 435 మార్కులు సాధించారు. ద్వితీయ సంవ త్సరం ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో 990పైగా ఒకరు, 989 మార్కులకుపైగా నలు గురు, 988పైన మార్కులు 5 మంది, సాధించారు. విద్యా ర్థులను డీన్లు వల్లభరావు, కోటేశ్వరరావు, మురళి, సుభానీ, ఏజీఎంలు హనుమంతరావు, రాజు, రామకృష్ణ రామారావు, ఆయా బ్రాంల ప్రిన్సిపాల్స్ వేద, రమాదేవి, సిహెచ్ శ్రీనివాస్ రవికాంత్, సురేష్, ఉపవాస్, జానీ, బాలకృష్ణ పవన్ తదితరులు అభినందించారు.



విద్యార్థులతో నారాయణ డీజీఎం శ్రీనివాసరెడ్డి తదితరులు

అమరావతికి అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం

చర్యలు తీసుకోవాలని ఎయిర్ పోర్ట్స్ శాఖ కార్యదర్శి ఆదేశం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో కొత్త అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం శరవేగంగా చర్యలు తీసుకుంటుంది. నూతన రాజధానిలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు చేయాలన్న విజ్ఞప్తిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశిస్తూ పెట్టుబడులు, మౌలిక వసతుల, ఎయిర్ పోర్ట్స్ శాఖ కార్యదర్శి యువరాజ్ ఉత్తర్వులను జారీ చేశారు. అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూ ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు గత ఏడాది ఆగస్టులో కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, ప్రధాని నరేంద్ర మోడీని కలిసి విజ్ఞప్తి చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, కూటమి నాయకులు, కమిటీ సభ్యులు

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ
- అల్లూరులో అంగరంగ వైభవంగా రథోత్సవం

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆకాంక్షించారు. మండలంలోని అల్లూరు గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి సహస్రాబ్ది అలంకరణ షష్ఠమదశ బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి ఆలయ అర్చకులు, గ్రామపెద్దలు భక్తులతో అంగరంగ వైభవోపేతంగా రథోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం ఉభయకర్తలు సుబ్బరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించి దేవస్థానం అర్చక బృందం స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అల్లూరు గ్రామపురవీధులలో స్వామివారి రథోత్సవంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొని శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. గ్రామపెద్దలు, అర్చకులు, ఉభయదాతలతో కలిసి స్వామివారి రథాన్ని లాగారు. ఈ కార్యక్రమంలో అల్లూరు గ్రామ భక్తులతోపాటు అలకాపురం, ఖాజీపాలెం, పోతనకట్టవారిపాలెం, జీఎన్‌పాలెం, మంతెనవారిపాలెం, సంగుపాలెం కోడూరు, కోమలి, భవనంవారిపాలెం తదితర గ్రామాలకు చెందిన భక్తులు వేలాది పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.వి.ఎస్.వర్మ ఆధ్వర్యంలో అల్లూరు యాదవపాలెం, రెడ్లపాలెం గ్రామాలకు చెందిన శ్రీరాధాకృష్ణ కోలాట భక్తసమాజం వారిచే ఆర్గనైజర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక కోలాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, నాగరాజు, రవి, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రముఖులు విద్యాభ్యాసం చేసిన బాపట్ల మున్సిపల్ హైస్కూల్

- నేడు 76వ వార్షికోత్సవం

బాపట్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : చరిత్ర కలిగిన బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో ఎందరో ప్రముఖులు విద్యనభ్యసించారు. స్వాతంత్ర్య సమర యోధులతోపాటు వివిధ రంగాలలో ఉద్దండులైన అనేక మంది మేధావులు ఇక్కడ విద్యనభ్యసించినవారే. బాపట్లబోర్డు అండ్ మున్సిపల్ హైస్కూల్ పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 75-76వ వార్షికోత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించనున్నారు. వార్షికోత్సవ కమిటీ ఇప్పటికే ఏర్పాట్లు చేశారు.



బాపట్ల మున్సిపల్ హైస్కూల్ భవన సముదాయం

విద్యనభ్యసించిన వారిలో ప్రముఖులు

బాపట్లలో అనేక మంది ప్రముఖులు విద్యనభ్యసించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, భట్టిప్రోలు సూర్యప్రకాశరావు, ప్రముఖ భావకవి రాయప్రోలు సుబ్బారావు, ప్రముఖ రంగ స్థల నటులు పద్మశ్రీ స్థానం నరసింహారావు, అద్దంకి శ్రీరామమూర్తి, ప్రముఖ సినీనటులు సి.ఎస్.ఆర్ ఆంజనేయులు, పి.ఎల్.నారాయణ, మెగాస్టార్ చిరంజీవి, బాక్రానంగల్ వంటి మేటి డ్యామ్‌ల ప్రాజెక్ట్ డిజైనర్ పద్మభూషణ్ నోరీ గోపాలకృష్ణమూర్తి, ప్రపంచ ప్రఖ్యాత గణితశాస్త్రవేత్త పద్మశ్రీ కొమరవోలు చంద్రశేఖరరావు, ప్రముఖ రాజకీయనాయకులు కోన ప్రభాకరరావు, డాక్టర్ ఉమారెడ్డి వెంకటేశ్వర్లు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ఇలా ఎందరో ఉత్తమ దిగ్గజాలను తెలుగుజాతికి అందించింది. అన్నవరపు పుండరీకాకుడు, వెలగపూడి దక్షిణామూర్తి, బ్రహ్మాండం బాపయ్య, చోరగూడి వెంకటాచలం, చోరగూడి వెంకటాద్రి, యల్లాప్రగడ భైరాగి, రాచపూడి జగన్నాధరావు, పాతూరి శివరామయ్య, యడవల్లి కామేశ్వరరావు, నోరీ వెంకటేశ్వర్లు, ఎస్.రామకృష్ణయ్య, టి.కొండలురావునాయుడు, డి.కృష్ణయ్య, శ్రీరామ్ వెంకటస్వామినాయుడు ఆలోచనకు ప్రతిరూపమే ఈ ఉన్నత పాఠశాల ఆవిర్భావం.

భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో భక్తుల బైక్ ర్యాలీ

బాపట్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రథంబజారులో శ్రీ విశ్వహిందుపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవపందిరి దగ్గర నుంచి జెండాలు పట్టుకొని జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. పురవీధులలో నిర్వహించిన ఈ ర్యాలీలో నిర్వాహకులు, భక్తులు పాల్గొనగా జై శ్రీరామ్ నామస్మరణతో మారుమ్రోగింది. ర్యాలీ అనంతరం ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం గావించారు. శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు.



భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

శ్రీ కల్యాణ వేంకటేశ్వస్వామికి ఘనంగా పుష్పయాగం



శ్రీకల్యాణ వేంకటేశ్వస్వామిని వివిధ పుష్పాలతో అలంకరించిన చిత్రం

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీఎన్‌పాలెం గ్రామంలోని శ్రీనివాసపురంలో ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శనివారం అత్యంత వైభపేతంగా నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు బృందావనం గోపిచంద్ తెలిపారు. తొలుత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు గ్రామపెద్దలతో కలిసి స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సంపత్ గణపతికి వసంతోత్సవం



స్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు

బాపట్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : శ్రీమహర్షి ఆశ్రమ గోశాలలో చైత్ర పౌర్ణమి హనుమత్ విజయోత్సవ రోజును పురస్కరించుకొని శనివారం ఉదయం మహాకలశ స్థాపన గోపూజ అనంతరం నవగ్రహ సహిత శ్రీ సూక్త విధానేనా సంపత్ గణపతి హోమ కార్యక్రమం జరిగింది. అనంతరం నవనాగసహిత మానసాదేవికి, సంపత్ గణపతికి వసంత పౌర్ణమిరోజు వసంతోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్ బి.బాబునాగేంద్ర, మామిడి రాజశేఖర్, పద్మజ, కె.శ్రీనివాసరావు, శ్రీదేవి, శ్రీహరినారాయణ, బూర్లె భాగ్యలక్ష్మీ, శ్యామలాదేవి, లక్ష్మీ, చెంచమ్మ, చందన, ప్రసన్నాదేవి, ఆదిలక్ష్మి, బెల్లంకొండ సత్యనారాయణ, కావూరి శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొని పూజలు చేశారు.

చెత్తరహిత బాపట్ల లక్ష్యంగా.. జిందాల్‌కు వ్యర్థాల తరలింపు

బాపట్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : చెత్తరహిత బాపట్ల లక్ష్యంగా అధికారులు అడుగులు వేస్తున్నారు. 34 వార్డులలో సేకరించిన వ్యర్థాలు మొత్తం జిందాల్ కంపెనీకి తరలిస్తున్నారు. ప్రతిరోజు 40 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను ఇక్కడ నుంచి పంపిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నెల నుంచి ఇప్పటి వరకు 29,133 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను ప్రత్యేక వాహనాలలో తరలిస్తున్నారు. ఇప్పటికే డంపింగ్ యార్డులో పెద్దఎత్తున నిల్వలు ఉన్న వ్యర్థాలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా వ్యర్థాలు వేరుచేసేందుకు యంత్రాన్ని ఏర్పాటు చేశారు. డంపింగ్ యార్డులో సుమారు 45వేల మెట్రిక్‌టన్నుల వ్యర్థాలు ఉన్నాయి. వీటిని యంత్రంతో మూడు విభాగాలుగా వేరు చేస్తున్నారు. ఓవైపు కంపోస్ట్, మరోవైపు వ్యర్థాలు, మధ్యలో రాళ్ళు ఇతర పనికిరాని వస్తువులు గుట్టలుగా వేస్తున్నారు. వ్యర్థాలు మొత్తం జిందాల్‌కు తరలిస్తుండగా కంపోస్టును మొక్కలు పెంచటానికి లేదా, రోడ్లు మెరక చేయటానికి వినియోగించే అవకాశం ఉంది. దీంతో డంపింగ్ యార్డులో నిల్వలు తగ్గిపోయి శుభ్రమౌతున్నది. అలాగే ప్రతిరోజు వార్డులలో సేకరించే వ్యర్థాలు కూడా జిందాల్ కంపెనీకి తరలిస్తున్నారు. ప్రతిరోజు వార్డులలో సేకరించే చెత్తను తరలించటానికి పురపాలక సంఘం నుంచి టన్నుకు రూ.800 చొప్పున చెల్లించాల్సి ఉంది. డంపింగ్ యార్డులో ఉన్న వ్యర్థాల నిర్వహణ బాధ్యత మాత్రం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చేపట్టింది. రాబోయే రోజుల్లో డంపింగ్ యార్డులో ఉన్న వ్యర్థాలు మొత్తం పూర్తిగా తరలించి ఇకపై వచ్చే వ్యర్థాలు ఏరోజుకు ఆరోజు జిందాల్‌కు తరలించటం వల్ల పారిశుధ్యం మెరుగు పడటమేకాకుండా చెత్తరహిత బాపట్లగా తీర్చిదిద్దే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.



డంపింగ్ యార్డులో వ్యర్థాలు వేరు చేస్తున్న యంత్రం

వ్యర్థాలు పూర్తిగా తరలిస్తాం



పారిశుధ్య కార్మికులు పట్టణంలో నిత్యం సేకరించే వ్యర్థాలను జిందాల్‌కు పంపించి అన్ని ప్రాంతాలను శుభ్రం చేస్తున్నాం. పట్టణ ప్రజలు కూడా దీనికి సహకరించి వ్యర్థాలు బహిరంగ ప్రదేశాలలో పడేయకుండా తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులు వచ్చిన సమయంలో వారికి అందించాలి. ఈవిధంగా అందరు సహకరిస్తే చెత్తరహిత బాపట్లగా తీర్చిదిద్దుతాం. **- కమిషనర్ జి.రఘునాథరెడ్డి.**

నాటుసారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ



బేతపూడిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు, గ్రామస్థులు

బాపట్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ తెలిపారు. మండలంలోని బేతపూడి గ్రామంలో శనివారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా అంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ విజయ మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్టప్రకారం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎ.జనార్దనరావు, బి.వెంకటేశ్వర్లు, సీఐ పి.గీతిక, ఎస్ఐలు డి.ప్రభుదాసు, ఎస్.మౌనిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు



జంపానివారిపాలెంలో ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న నాటుసారా

రేపల్లె, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నగరం ఎక్సైజ్ సీఐ మాటూరి శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. శనివారం నిజాంపట్నం మండలం దిండి పంచాయతీ జంపానివారిపాలెం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు నాటుసారా తయారీ బట్టీలపై దాడులు నిర్వహించి ధ్వంసం చేశారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా బట్టీ తయారీలవద్ద 100 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశామన్నారు. పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. ఈ బట్టీల నిర్వాహకులపై కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు వి.శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ, పి.గోపి, ఎక్సైజ్ సీఐ ఎ.శ్రీనివాసరావు, ఎక్సైజ్ ఎస్ఐ టి.రాజేశ్వరి పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్‌ప్రవర్తన కలిగి ఉండాలి

బాపట్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్లు సత్‌ప్రవర్తన కలిగి ఉండాలని పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో శనివారం రాత్రి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎలాంటి గొడవలకు వెళ్ళకుండా మంచిగా ఉండాలని చెప్పారు.

పీఏసీ మెంబర్‌లుగా మాజీ ఎమ్మెల్యే కోన, మాజీ ఎంపీ సురేష్

బాపట్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పొలిటికల్ అడ్వయిజర్ కమిటీ సభ్యులుగా మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, మాజీ ఎంపీ నందిగం సురేష్‌లను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం శనివారం ప్రకటించింది. కమిటీ సభ్యులను పూర్తి స్థాయిలో పునర్ వ్యవస్థీకరించి మొత్తం 33 మందిని నియమించగా అందులో వీరు ఉన్నారు.

వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శిగా ఫర్వేజ్

కర్లపాలెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్రకమిటీ సహాయ కార్యదర్శిగా షేక్ ఫర్వేజ్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసిందని పార్టీ నాయకులు శనివారంతెలిపారు. ఈ సందర్భంగా షేక్ ఫర్వేజ్ మాట్లాడుతూ వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శిగా తనను నియమించినందుకు వైసీపీ మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతికి, వైసీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జునకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

నైపుణ్యాభివృద్ధికి ఒకేషనల్ విద్యాకోర్సులు దోహదం

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : నైపుణ్యాభివృద్ధికి ఒకేషనల్ విద్యాకోర్సులు దోహదపడతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.మోహనరావు తెలిపారు. మండల పరిధిలోని ఐలవరం జడ్పీహెచ్ఎస్‌లో డిజిటల్ సర్వీసులు, డేటా ఎంట్రీ, ఆన్‌లైన్ వర్క్ అంశాలపై పది రోజుల పాటు శిక్షణ నిర్వహించినట్లు హెచ్ఎం శనివారం తెలిపారు. ఒకేషనల్ విద్యార్థుల సమగ్ర శిక్ష ఐటి ట్రేడ్‌లలో భాగంగా ఈ నెల 3వ తేదీ నుంచి పది రోజుల పాటు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా భట్టిప్రోలు, కనగాలలోని సచివాలయం, పోస్టాఫీసు, మీ-సేవా కేంద్రాల్లో జరిగే ఆన్‌లైన్ కార్యకలాపాలపై శిక్షణ పొందారు. సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న సాంకేతిక అభివృద్ధిపై అవగాహన కల్పించేందుకు విద్యార్థినులకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ఐటి ఒకేషనల్ ఉపాధ్యాయురాలు పి.తిరుమలాదేవి పర్యవేక్షణలో విద్యార్థినుల శిక్షణ కార్యక్రమం జరిగినట్లు తెలిపారు.

శ్రీసత్యసాయిబాబా మందిరంలో పౌర్ణమి పూజలు

కర్లపాలెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం శ్రీసత్యసాయి బాబా మందిరంలో శనివారం పౌర్ణమి పూజలు భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు దాతల సహకారంతో అన్నప్రసాదం వితరణ నిర్వహించారు.

హనుమాన్ ఆశీస్సులు ప్రజలపై ఉండాలి : నామన

బాపట్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రామభక్త హనుమాన్ ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ ఆకాంక్షించారు. పట్టణంలోని సూర్యలంకరోడ్డులో ఉన్న శ్రీ సువర్చల సమేత శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శనివారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. అదేవిధంగా శృంగారపురంలోని శ్రీ అభయ కోదండరామాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాలలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీకోదండరామాలయంలో పూజలు నిర్వహిస్తున్న నామన వెంకట శివన్నారాయణ

పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు

కొల్లూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : తమపై దాడి చేసినట్లు ఇచ్చిన పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు ఏఎస్ఐ అర్జునరావు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెదలంక గ్రామానికి చెందిన ఉప్పు వెంకటేశ్వరరావు శుక్రవారం ఉదయం పొలానికి వెళుతుండగా చింతలంక గ్రామానికి చెందిన తోడేటి సురేష్ అనే వ్యక్తి వెంకటేశ్వరరావుని కలిసి తనపై ఉన్న కేసులో నువ్వు, నీ కుమారుడు సాక్షులుగా ఉన్నారని, తనకు అనుకూలంగా సాక్ష్యం చెప్పాలని బెదిరించగా, ఆ కేసులతో తనకేమి సంబంధం లేదని చెప్పి వెళుతుండగా సురేష్ వెనుక నుంచి నెట్టి కింద పడవేసి కర్రతో కొట్టి గాయపరిచినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాది అతని కుమారులు తన ఇంటికి వచ్చి గొడవపడినట్లు, సురేష్ పొలం వెళ్లి ఇంటికి వచ్చే క్రమంలో దాడి చేసి కులం పేరుతో తిట్టారని తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ సురేష్ ఫిర్యాదు ఇచ్చారని ఏఎస్ఐ తెలిపారు. పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నియోజకవర్గంలో 20 మోడల్ స్కూల్స్ ఏర్పాటు

- తల్లిదండ్రుల ఆమోదంతో తీర్మానాలు
- హైస్కూల్ స్థాయికి దుండిపాలెం యూపీ స్కూల్
- ఎమ్మెల్యే ఆదేశాలతో నివేదికలు సిద్ధం



చుండూరు మండలం దుండిపాలెంలోని యూపీ పాఠశాల

వేమూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యాశాఖ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మోడల్ స్కూల్స్ (ఆదర్శ పాఠశాలలు) ఏర్పాటుకు వేమూరు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దీంతో నిబంధనల మేరకు పాఠశాలలను గుర్తించేందుకు నియోజకవర్గంలో ఐదు మండలాల పరిధిలోని విద్యాశాఖ అధికారులు అర్హత చెందిన పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు ఏర్పాటు చేశారు. మోడల్ స్కూల్స్ నిర్వహణ విషయంపై విశదీకరించి వారి ఆమోదంతో తీర్మానాలు చేశారు. నియోజకవర్గంలో 226 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో ప్రాథమిక పాఠశాలలు 193, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు నాలుగు ఉన్నత పాఠశాలలు 29 ఉన్నాయి. విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆలోచనను గ్రహించిన తల్లిదండ్రులు 20 పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా ఏర్పాటు చేసేందుకు తమ ఆమోదాలను తెలిపారు. వాటిలో ఒక ప్రాథమికోన్నత పాఠశాలను ఎమ్మెల్యే సిఫార్సు మేరకు మోడల్ స్కూల్స్ విధానాన్ని అమలు పరుస్తూ ఉన్నత పాఠశాల స్థాయికి పెంచేందుకు తీర్మానించారు. విద్యాశాఖ అధికారులు తెలియజేసిన వివరాల ప్రకారం చుండూరు మండలంలో 30 ప్రాథమిక ఒక ప్రాథమికోన్నత పాఠశాల ఉన్నాయి. వాటిలో చుండూరులోని అంబేద్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్ కింద ఎంపిక చేశారు. దుండిపాలెం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో 170 మంది విద్యార్థులు ఉండటంతో ఆ పాఠశాలను మోడల్ స్కూల్ కింద గుర్తిస్తూ ఉన్నత పాఠశాలగా తీర్చిదిద్దేందుకు తీర్మానించారు. భట్టిప్రోలు మండలంలో ప్రాథమిక పాఠశాలలు 41, ప్రాథమికోన్నత పాఠశాల ఒకటి ఉండగా వాటిలో భట్టిప్రోలులోని బిఆర్ పాఠశాలను, ఐలవరంలోని పాఠశాలను మోడల్ స్కూల్స్‌గా మార్చేందుకు తీర్మానించారు. కొల్లూరు మండలంలో 43 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత పాఠశాల ఉండగా కొల్లూరులోని బిఎఫ్ఎస్ పాఠశాలను మాత్రమే మోడల్ స్కూల్ కింద గుర్తించారు. అమృతలూరు మండలంలో 43 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత పాఠశాల ఉండగా ఇక్కడ కూచిపూడి, మూల్పూరు, పెదపూడి, ప్యాపర్రు, గోవాడ గ్రామాల్లోని ఐదు పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా గుర్తించారు. వేమూరు మండలంలో 36 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత పాఠశాల ఉండగా వాటిలో పోతుమర్రులోని ప్రాథమికోన్నత, జంపని ఉర్దూ, జంపని బిఎఫ్ఎస్ వేమూరులోని ఎల్ఈ చావలిలోని ఆర్ పాఠశాలను మోడల్ స్కూల్స్‌గా ఏర్పాటు చేసేందుకు తీర్మానించారు. తీర్మానించిన 20 పాఠశాలలకు సంబంధించిన పూర్తి నివేదికలను ప్రభుత్వ ఆమోదం కోసం అధికారులు ఎమ్మెల్యే ఆనందబాబుకు అందజేశారు. కాగా 60 మంది కన్నా తక్కువగా విద్యార్థులు ఉన్న 177 ప్రాథమిక పాఠశాలలు, మూడు ప్రాథమికోన్నత పాఠశాలలు బేసిక్ పాఠశాలలుగా కొనసాగనున్నాయి. మోడల్ స్కూల్స్‌లో ఒకటి నుండి ఐదు తరగతుల వరకు ఐదుగురు ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉంటారు. విద్యార్థుల సంఖ్య 60 కన్నా పెరిగితే ఉపాధ్యాయుల సంఖ్య కూడా పెరగనుంది. బేసిక్ స్కూల్స్‌లో మాత్రం 60 మంది కన్నా తక్కువ మంది విద్యార్థులు ఉంటే 20 మంది విద్యార్థులకు ఒకరు 21 నుండి 45 మంది విద్యార్థులకు ఇద్దరు ఆపైన సంఖ్య పెరిగితే అదనంగా మరొక ఉపాధ్యాయులు మాత్రమే ఉంటారు. కొత్త విధానాల్లో ఈ బేసిక్ స్కూల్స్‌ని ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్చనున్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు) ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శనివారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వారు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స పొందారు. ఎమ్మెల్యేను సంప్రదించి తమ ఆర్థిక పరిస్థితులు తెలియజేశారు. స్పందించిన ఆనందబాబు రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎం ఆర్ఎఫ్ కార్యాలయానికి పంపించారు. లబ్ధిదారులు రహిమున్నీసా రూ.1,00,741, షేక్ సబ్రీన్ రూ.41,875, చెరుకూరి సుశీల రూ.66,931, గుండా శిరీష రూ.30,028, కంచర్ల రాజేష్ రూ.55,785, కటకం సరస్వతి రూ.37,378, ఐదురుల్లా బేగ్ రూ.30,786, సుకన్య రూ.20 వేలు వంతున ముఖ్యమంత్రి కార్యాలయం వచ్చిన చెక్కులను గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే ఆనందబాబుకు లబ్ధిదారులు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్నకాలనీలో సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : జగనన్నకాలనీలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. జగనన్నకాలనీలో నివాసాలు ఉంటున్న ప్రజల సమస్యలను శనివారం ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగనన్నకాలనీ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జగన్నకాలనీలో రహదారులు, తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని, ప్రభుత్వం దృష్టిసారించి జగనన్నకాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ నాయకులు వి.ధనమ్మ, రవికుమార్, కె.నాంచారమ్మ, దుర్గాదేవి, ఆగస్టీన్, షేక్ పర్వానా, ఎ.పిచ్చియ్య, కె.వీరాంజనేయులు, కె.వెంకట్రావు పాల్గొన్నారు.

ఉచిత మజ్జిగ శిబిరం ప్రారంభం

రేపల్లె, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : రోజురోజుకి ఎండతీవ్రత ఎక్కువ అవ్వటంతో ప్రజలకు దాహార్తిని తీర్చాలనే ఉద్దేశ్యంతో ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని ఆర్యవైశ్య నాయకుడు సుగ్గుల సుదర్శన్ అన్నారు. పట్టణంలోని ప్రకాశంరోడ్డులో మజ్జిగ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, పాలు పంపిణీ

రేపల్లె, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో 100 మంది రోగులకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకుని పాలు, బ్రెడ్, పండ్లు పంచిపెట్టారు. అనంతరం గరువురోడ్డులోని అనాథశ్రమ శరణాలయంలో 100 మంది పిల్లలకు భోజన సదుపాయాలను ఏర్పాటు చేసి అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాగితాల హనుమ, షేక్‌జమీర్, కరేటి కోటి, కేసన నరసింహ, దాసరి మునిసుబ్బారావు, చిరంజీవి, గోపి,రమేష్, యరగళ్ళవీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

కొల్లూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో కొల్లూరు జీపీఎస్ఆర్ఎన్ ఎస్ఎఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. శనివారం విడుదలైన ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కొవెవరపు స్నేహ ఎంపీసీ గ్రూపులో 1000 మార్కులకు గాను 864 మార్కులు, అన్నమనేని నాగశ్రీ 819 మార్కులు, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో వేము కావ్య 352 మార్కులు, కొండమంచిలి శ్రీవల్లి 307 మార్కులు సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపారు. మొత్తం ఫలితాల్లో 53 శాతం సాధించినట్లు చెప్పారు.

906 మార్కులు సాధించిన ఎంపీసీ విద్యార్థిని



గంజి శ్రీలక్ష్మి

వేమూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ సెకండియర్ ఎంపీసీ విద్యార్థిని గంజి శ్రీలక్ష్మి వెయ్యి మార్కులకు గాను 906 మార్కులు సాధించింది. బైపీసీ గ్రూపునకు చెందిన రుషిత 818 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ గాయత్రి తెలిపారు. ఫలితాల వివరాలను తెలియజేస్తూ ఫస్ట్ ఇయర్‌లో 51 మందికి గాను 20 మంది ఉత్తీర్ణత చెందారు. జనరల్ విద్యార్థులు 24 మందిలో ఏడుగురు, ఒకేషనల్ విభాగంలో 27 మందికి 13 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇయర్‌కు చెందిన జనరల్ విద్యార్థులు 15 మందిలో 8 మంది, ఒకేషనల్‌కు చెందిన 9 మందిలో ఐదుగురు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఫిజిక్స్, బోటనీ, ఇంగ్లీష్ సబ్జెక్టులకు సంబంధించిన వారు ఫెయిల్ అయినట్లు తెలిపారు. కాగా మే నెల 12వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

ప్రభుత్వ బధిరుల ఆశ్రమ జూనియర్ కళాశాల నూరుశాతం ఉత్తీర్ణత

బాపట్లరూరల్,ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫలితాలలో బాపట్ల ప్రభుత్వ బధిరుల ఆశ్రమ జూనియర్ కళాశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించటం జరిగిందని ప్రిన్సిపాల్ డిఎస్ రజియా తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 25 మంది పరీక్షకు హాజరు కాగా 25 మంది ఉత్తీర్ణత సాధించటం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 96 శాతం ఉత్తీర్ణత సాధించటం జరిగిందన్నారు. యు.నాగమల్లేశ్వరి 633 మార్కులను సాధించి ప్రథమ స్థానాన్ని సాధించటం జరిగిందని తెలిపారు. పి.వర్షిత 611 మార్కులు (ద్వితీయ స్థానం) బి.ఉషా 603 మార్కులు సాధించి (తృతీయ స్థానం) సాధించటం జరిగిందని ప్రిన్సిపాల్ చెప్పారు.

ఆలపాటి వెంకట్రామయ్య జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు..

చుండూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : యడ్లపల్లిలోని శ్రీ ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో నూరుశాతం విజయం సాధించారు. 9 మంది విద్యార్థులకు 9 మంది కృతార్థులయ్యారు. సీఈసీ గ్రూపులో చేబ్రోలు దీపిక 931 మార్కులు, ఎం.నిర్మలజ్యోతి 889, చిలక ఐశ్వర్య 860 మార్కులు పొందారు. మొదటి సంవత్సరం ఫలితాలలో 23 మందికి 20 మంది ఉత్తీర్ణత సాధించారు. కొండమూడి షారోన్ 500 మార్కులకు 481 మార్కులు, షేక్ న్యామతున్నీసా 466, బాలగౌతమి 449 మార్కులు పొందారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, విద్యా కమిటీ, ఉపాధ్యాయులు అభినందించారు.



దీపికను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వేమూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి పురస్కరించుకుని అంబేద్కర్ యూత్ వేమూరు వారి ఆధ్వర్యంలో శనివారం వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాలకు వేర్వేరుగా ఈ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత విధానంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారికి 14వ తేదీ అంబేద్కర్ జయంతి సందర్భంగా మొదటి బహుమతిగా రూ.3 వేలు, రెండవ బహుమతి రూ.2 వేలు, మూడవ బహుమతిగా రూ.వెయ్యి నగదు ప్రోత్సాహకాలు అందించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులకు ఆదివారం వారు సాధించిన మార్కులు తెలియజేస్తామని అంబేద్కర్ యూత్ సభ్యులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం దిక్సూచి

● రూ. లక్ష పెట్టుబడి.. రూ. 4 లక్షల ఆదాయం ● గుంటూరు జిల్లాలో శ్రీనివాసరెడ్డి సక్సెస్ స్టోరి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) సాంప్రదాయ వ్యవసాయానికి భవిష్యత్తు లేదని, ప్రకృతి వ్యవసాయం పైనే భవిష్యత్తు ఆధారపడి ఉందని గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నూతక్కి గ్రామానికి చెందిన రైతు కళ్ళం శ్రీనివాసరెడ్డి నిరూపిస్తున్నారు. భూములను లోతుగా దుక్కులు చేయడం వల్ల భూసారం పూర్తిగా తగ్గిపోతోందని, మితిమీరిన రసాయన ఎరువుల వినియోగం కారణంగా భూమిలోని సూక్ష్మజీవులు ఒక్కొక్కటిగా నశించి సేంద్రియ కర్బనం పూర్తిగా ఆవిరైపోతుందని, ఈ విధానం పంట దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తూ రైతులను నష్టాల్లోకి నెడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

44 ఏళ్ల వ్యవసాయ అనుభవం కలిగిన శ్రీనివాసరెడ్డి ప్రకృతి వ్యవసాయం ద్వారా అనేక లాభాలను గడిస్తున్నారు. ఆయన కథ ఏమిటో ఒకసారి తొంగిచూద్దాం. శ్రీనివాస్ రెడ్డి రసాయనిక వ్యవసాయం చేస్తున్న తరుణంలో రసాయన మందుల ఖర్చు అత్యధికంగా ఉండేది. పురుగు, తెగుళ్ల నివారణ కోసం రైతుల మధ్య విభిన్న మందుల సూచనలు ఉండేవి. కానీ అవి ఆశించిన ఫలితాన్ని ఇచ్చేవికావు. ఫలితం లేదని దుకాణాల వద్దకు వెళ్లినప్పుడు మరో రకం రసాయనం వాడాలని సూచించడంతో ఖర్చులు పెరిగి గీట్టుబాటు ధర లేక నష్టాలు ఎదురయ్యేవి.

శ్రీనివాస్ రెడ్డి తెల్ల మొక్కజొన్న, అరటి, చామ వంటి పంటలు వేశారు. ఆయా పంటలకు యూరియా 266 కేజీలు, పోటాష్ 1750 కేజీలు, డి.ఎ.పి 1700 కేజీల మేర వినియోగించారు. మొత్తం వ్యయం ఎకరానికి దాదాపు రూ.25 వేల వరకు అయ్యింది. దానికి తోడు, పురుగు, తెగుళ్ల నివారణ కోసం రసాయన పురుగుమందులు మూడు నుంచి నాలుగు సార్లు పిచికారీ చేసేవారు. అధిక పెట్టుబడుల వల్ల నష్టాలు వాటిల్లేవి.

రైతు సాధికార సంస్థ శిక్షణలతో ప్రకృతి వ్యవసాయంలోకి..

2018 సంవత్సరంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, ప్రకృతి వ్యవసాయం గురించి శ్రీనివాసరెడ్డి అవగాహన


ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కంద గడ్డల పంటతో రైతు శ్రీనివాస రెడ్డి

పెంచుకున్నారు. అయితే రసాయనిక వ్యవసాయంలో వచ్చినంత దిగుబడి ప్రకృతి వ్యవసాయంలో వస్తుందా .. రాదా.. అనే సంశయంతో తొలుత ముగ్గురు అన్నదమ్ములు ఒక్కొక్కరు అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించారు.

ప్రకృతి వ్యవసాయంలో మానవ శ్రమ... ప్రాధాన్యం

మొదటగా 7 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ప్రారంభించినప్పుడు, అధిక సంఖ్యలో కూలీల అవసరం ఏర్పడింది. ముఖ్యంగా, ఘన, ద్రవ జీవామృతం తయారు చేసి వేయడానికి ఖర్చులు అధికంగా ఉండేవి. ప్రారంభ దశలో ఎకరాకు 30 నుంచి 40 బస్తాల ఘన జీవామృతం ఉపయోగించేవారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సూచన మేరకు భూమిలో తేమ ఉన్నప్పుడు జీవామృతాలను ప్రయోగిస్తే మంచి ఫలితాలు వస్తాయని గుర్తించారు. అయితే తేమ ఉన్న సమయంలో పొలంలో ఉపయోగించేందుకు మానవ శ్రమ అధికంగా అవసరమయ్యేది. 2018 నుంచి మూడు సంవత్సరాల పాటు ఘన జీవామృతం వినియోగించారు. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ విధానం అనుసరిస్తున్నారు. ఆసక్తికరంగా ఘన జీవామృతం వాడిన భూమిలోనూ, ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ వాడిన భూమిలోనూ దాదాపు సమానమైన దిగుబడి వచ్చిందని గుర్తించారు. అయితే ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ వాడిన భూమిలో కలుపు తక్కువగా ఏర్పడిందని అనుభవంతో వెల్లడైంది.

ఈ అనుభవం ఆధారంగా, తర్వాతి దశలో మొత్తం పొలంలో ఘన జీవామృతం ఉపయోగించడాన్ని విరమించుకున్నారు. దాని స్థానంలో, దాదాపు 30 రకాల పచ్చిరొట్టి పంటల విత్తనాలు విత్తారు. పచ్చిరొట్టి పంటలను నేరుగా భూమిలో కలియ దున్నకుండా కోసి భూమిపై పరచి ఉంచడం వల్ల వానపాములు, సూక్ష్మజీవులు పెరిగి, పంటలకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా లభించాయి. ఈ ప్రక్రియ వల్ల, భూమి గుల్లబారి, పంటలు ఆరోగ్యంగా పెరిగే అవకాశం లభించింది.

గణనీయమైన దిగుబడి

2022-23 సంవత్సరంలో అరటి,పసుపు సాగు చేసేందుకు ఖర్చు రూ..1,02,000 కాగా, అరటి 250 క్వింటాళ్ల దిగుబడి తో ఆదాయం రూ. 4,98,000 వరకు వచ్చింది. పసుపు 25 క్వింటాళ్ల దిగుబడి తో ఆదాయం రూ.3,96000 వరకు రావడం జరిగింది. 2023-2024 సంవత్సరంలో అరటి,పసుపు సాగు చేసేందుకు ఖర్చు రూ.1,02,000 వరకు కాగా,అరటి 255 క్వింటాళ్ల దిగుబడితో రూ.4,64,250 ఆదాయం రావడం జరిగింది. పసుపు 25 క్వింటాళ్ల దిగుబడితో రూ.3,62,250 ఆదాయం వచ్చింది. 2024-25 సంవత్సరంలో అంచనాల ప్రకారం అరటి, పసుపు సాగు కు రూ.1,02,000 ఖర్చు అయ్యింది. అరటి 255 క్వింటాళ్ల దిగుబడితో రూ.5,09,250 ఆదాయం వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. పసుపు 25 క్వింటాళ్ల దిగుబడితో రూ. 4,07,250 ఆదాయం వస్తుందని అంచనా.

నేరుగా మార్కెటింగ్... వినియోగదారులకు లాభం

శ్రీనివాస్ రెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలు అధిక నాణ్యత కలిగి ఉండటంతో, వ్యాపారస్తులు, వినియోగదారులు నేరుగా పొలం వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఈ విధానం మధ్యవర్తుల వ్యవస్థను తొలగించి అధిక లాభాలను రైతులకు అందించడంతో పాటు కొనుగోలుదారులు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను చౌక ధరలకు పొందగలుగుతున్నారు. ప్రకృతి వ్యవసాయంలో జీవఆచ్ఛాదనం (పచ్చిరొట్టి ఎరువులు) పాటించడం వల్ల కలుపు నివారించగలిగారు. వివిధ రకాల పంటలను వేయడం వల్ల పురుగులు మరియు తెగుళ్ల ప్రభావం తగ్గడమే గాకుండా పూర్తిగా నివారించగలిగారు.

ఉత్తమ రైతు అవార్డు అందుకున్న శ్రీనివాసరెడ్డి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీనివాసరెడ్డికి "ఉత్తమ రైతు అవార్డు" ప్రదానం చేసింది. మిల్లినియం అవార్డుతో పాటు సంక్రాంతి రైతు సదస్సు సందర్భంగా ముప్పారపు ఫౌండేషన్ నుంచి "ఉత్తమ రైతు అవార్డు"ను అందుకున్నారు.

పది జిల్లాల రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి...

రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఎంతో మంది రైతులు క్రమం తప్పకుండా శ్రీనివాసరెడ్డి సలహాలు, సూచనలు తీసుకుని ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తున్నారు. శ్రీనివాసరెడ్డి తన ప్రయోగాలు, పట్టుదల, సృజనాత్మకతతో వ్యవసాయంలో కొత్త ఒరవడిని సృష్టించి ప్రకృతి వ్యవసాయ ప్రయోజనాలను ప్రామాణికంగా చూపించగలుగుతున్నారు. ప్రకృతి వ్యవసాయంలో అనేక మంది రైతులకు మార్గదర్శకుడిగా మారారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తే పర్యావరణాన్ని పరిరక్షించడమే కాకుండా రైతుకు లాభదాయకంగా కూడా మారుతుందని నిరూపిస్తున్నారు.


శ్రీనివాసరెడ్డి అరటి తోటను పరిశీలిస్తున్న కేరళ వ్యవసాయ అధికారుల బృందం

శ్రీశైలంలో కల్యాణ మండపం నిర్మాణం

● ప్రారంభించిన జస్టిస్ లావు నాగేశ్వరరావు


కల్యాణ మండపం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ లావు నాగేశ్వరరావు

చిలకలూరిపేట ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త దండా బ్రహ్మనందం శ్రీశైలం కాకతీయ కమ్మసత్రం ఆవరణలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన కల్యాణ మండపాన్ని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు సంపాదించడం ముఖ్యం కాదని, సమాజ హితం కోసం, తోటి వారికి సాయం చేసేందుకు డబ్బు ఖర్చు చేసే గుణం అలవర్చుకోవాలని సూచించారు. దండా బ్రహ్మనందం ఆ కోవలోకి వస్తారని చెప్పారు. కులమేదైనా పేదలు, మధ్యతరగతి కుటుంబాల వారు తక్కువ ఖర్చుతో వివాహాలు చేసుకోడానికి కల్యాణ మండపంలో అవకాశం కల్పించ పూనుకోవడం అభినందనీయమన్నారు. కుల భేదం లేకుండా వేలాదిమంది భక్తులకు శ్రీశైలంలో నిత్యం భోజన సౌకర్యం కల్పిస్తున్న సత్రం కమిటీని ఆయన అభినందించారు. దండా బ్రహ్మనందం, లక్ష్మీరాజ్యం దంపతులను లావు నాగేశ్వర రావు ఘనంగా సత్కరించారు. అతిథులుగా విజయవాడ సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, హైదరాబాదు కాకతీయ విద్యా ట్రస్టు అధ్యక్షుడు బొల్లినేని కృష్ణయ్య పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు(చిలకలూరిపేట) అధ్యక్షత వహించగా, కార్యదర్శి తుమ్మల రమేష్ చంద్రబోస్ (హైదరాబాదు), కోశాధికారి ముత్తినేని వెంకటేశ్వర్లు(వినుకొండ) పాల్గొన్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన పలువురు ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైళ్ల భద్రతకే ప్రథమ ప్రాధాన్యం

● అన్ని రంగాల్లో డివిజన్‌ని అగ్రపథాన నిలబెట్టేందుకు కృషి ● మీడియా సమావేశంలో నూతన డీఆర్ఎం సుధేష్ణ సేన్


రైల్‌వికాస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రైళ్ల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ చెప్పారు. భద్రతకు సంబంధించి ప్రతీ చిన్న విషయాన్ని లోతుగా పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని చెప్పారు. గత సోమవారం గుంటూరు నూతన డీఆర్ఎంగా బాధ్యతలు స్వీకరించిన సుధేష్ణ సేన్ శనివారం సాయంత్రం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ భద్రతతో పాటు రైళ్ళ, గూడ్స్‌ల సమయపాలన, అన్ని విభాగాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. రైళ్ల సమయపాలనలో గుంటూరు డివిజన్ ముందువరసలో ఉందన్నారు. గత ఏడాది దేశంలోనే 10వ స్థానంలో, జోన్‌లో ప్రథమ స్థానంలో నిలిచిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. రైల్వేలో కొత్త విధానపరమైన నిర్ణయాలు అమలులోకి వచ్చాయని, వాటన్నింటిపై ఎప్పటికప్పుడు అన్ని విభాగాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి అప్‌డేట్ చేస్తామన్నారు.

గుంటూరు డివిజన్‌లో డీఆర్ఎంగా విధులు నిర్వహించడం ఎన్నో సవాళ్లతో కూడుకున్న బాధ్యత అని, కచ్చితంగా వాటిని అధిగమించేందుకు చర్యలు చేపడతానని పేర్కొన్నారు. సరుకు రవాణ, ప్యాసింజర్ టిక్కెట్ల ఆదాయంలో ఎంతో పురోగతి సాధించిందని, గత ఏడాది రూ. 431 కోట్లు వసూలు చేసి డివిజన్ చరిత్రలో రికార్డు నెలకొల్పిందన్నారు. ఈ ఏడాది మరిన్ని మార్గాలను అన్వేషించి రైల్వేకు ఆదాయం పెంచుతామని చెప్పారు. డివిజన్‌లో ఇంజనీరింగ్ వర్కులు బాగా జరుగుతున్నాయని, గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్, నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలుమార్గం వంటి పనులు పూర్తి అయితే డివిజన్ మరింత పురోగతి సాధిస్తుందన్నారు. ఇంకా డివిజన్‌కు శాంక్షన్ అయి ఉన్న ఇంజనీరింగ్ వర్కులు, రైలుమార్గాలను ఇన్‌స్పెక్షన్ చేసి సమీక్షలు నిర్వహించి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకొంటామన్నారు. రైల్వే సిబ్బంది సౌకర్యార్థం అనేక ఆస్పత్రులు నిర్మించడం జరిగిందని, అవి పూర్తిగా ఉపయోగపడేలా చూస్తామన్నారు. ఇక్కడ డీఆర్ఎంగా నియామకం పొందడం సంతోషంగా ఉందని, మూడు నెలల్లో తెలుగు భాష నేర్చుకుని స్థానిక భాషలోనే మాట్లాడేందుకు ప్రయత్నిస్తానన్నారు. అలానే ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తామన్నారు. ఈ సమావేశంలో సీనియర్ డీసీఎం డాక్టర్ ప్రదీప్‌కుమార్, సీనియర్ డీవోఎం శ్రీనాథ్ పాల్గొన్నారు.



గుంటూరులో సంయుక్త మీనన్ సందడి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): డెవిల్, సార్, విరూపాక్ష చిత్రాల హీరోయిన్ సంయుక్త మీనన్ శనివారం గుంటూరులో సందడి చేశారు. ఓ ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన సంయుక్త మీనన్‌ను చూసేందుకు ప్రేక్షకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆమెతో సెల్ఫీ తీసుకునేందుకు అభిమానులు ఆసక్తి చూపించారు. ఈ సందర్భంగా సంయుక్త మీనన్ మాట్లాడుతూ గుంటూరుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం హీరో బాలకృష్ణ నటిస్తున్న అఖండ-2లో కీలక పాత్ర పోషిస్తున్నానన్నారు.

గుంటూరు మీదగా విశాఖపట్టణం, కర్నూలు సిటీ ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా విశాఖపట్టణం, కర్నూలు సిటీలకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 08545 విశాఖపట్టణం - కర్నూలు సిటీ ప్రత్యేక రైలు ఈ నెల 15వ తేదీ నుంచి మే 27వ తేదీ వరకు ప్రతీ మంగళవారం రాత్రి 7 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి దాటాక 1.35కి గుంటూరు, 2.28కి నరసరావుపేట, 2.58కి వినుకొండ, బుధవారం ఉదయం 9.35కి కర్నూలు సిటీ చేరుకొంటుంది. నంబరు. 08546 కర్నూలు సిటీ - విశాఖపట్టణం ప్రత్యేక రైలు ఈ నెల 16 నుంచి మే 28 వరకు ప్రతీ బుధవారం సాయంత్రం 4.10కి బయలుదేరి రాత్రి 9.58కి వినుకొండ, 10.33కి నరసరావుపేట, 11.25కి గుంటూరు, గురువారం ఉదయం 8 గంటలకు విశాఖపట్టణం చేరుకుంటుందన్నారు.

కుక్కలపై 'అవిశ్వాస తీర్మానం'

● బయటకు తరలించాలని స్వచ్ఛంధ సంస్థలకు పిలుపు
● బహిరంగ ప్రకటన జారీ చేసిన సూపరింటెండెంట్

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కుక్కలను పరిసర ప్రాంతాల నుంచి బయటకు తోలడం చిన్న విషయమే. కాని ఇది గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో పెద్ద వివాదంగా మారింది. జీజీహెచ్‌లో రాత్రింబవళ్లు వందలాది కుక్కలు తచ్చాడుతున్నాయి. వీటిని బయటకు తరలించడం అధికారులకు తలకు మించిన భారంగా పరిణమిస్తోంది. ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో కొద్ది రోజులుగా భారీ సంఖ్యలో శునకాలు తిష్టవేశాయి. ప్రతినిత్యం సుమారు 200 కుక్కలు ఆవరణలో తచ్చాడుతుంటాయి. రోగులు, వారి సహాయకులు వేసే ఆహార పదార్థాలు తినేందుకు ఇవి నిత్యం ఆసుపత్రిలో తిరుగుతున్నాయి. మధురాన్నం భోజనశాల, శాంతి మైదానం, తల్లీబిడ్డ గార్డెన్స్ వంటి ప్రాంతాలతో పాటు వివిధ వార్డుల



సమీపంలో తిరుగుతూ అక్కడ పడవేసే పదార్థాల కోసం ఎగబడుతుంటాయి. క్యాజువాల్టీ సమీపంలోని పోలీస్ ఔట్ పోస్ట్ సిబ్బంది సైతం వీధి కుక్కలకు ఆహారం వేస్తూ పెంచిపోషించడం విశేషం. ఇవి రోగులపై, వారి సహాయకులపై ఎగబడి కరిచేందుకు ప్రయత్నించడం అధికారులకు తల నొప్పిగా మారింది.

స్వచ్ఛంధ సంస్థల సాయం కోసం వేడుకోలు...

నగర పాలక సంస్థ సహకారంతో వీటిని పట్టుకెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసి బయట విడిచిపెట్టినా మరలా అవి ఆసుపత్రిని వెతుక్కుంటూ వస్తున్నాయి. ఇటీవల ఆసుపత్రిలో 50 కుక్కలను పట్టుకొని కు.ని. సర్జరీలు చేసి వదిలిపెట్టారు. మరో పక్క ఇలా కుక్కలను బలవంతంగా బయటకు తరలించడం చట్టరీత్యా నేరమని, దీనిని తాము వ్యతిరేకిస్తున్నామంటూ జంతు ప్రేమికుల సంఘం ప్రతినిధులు ప్రతిఘటిస్తున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో తిరుగుతున్న కుక్కలను బయటకు పట్టుకెళ్లి ఆసుపత్రిలో సమస్యలు తగ్గించేందుకు స్వచ్ఛంధ సంస్థలు ముందుకు రావాలని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి బహిరంగ ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆసుపత్రిలో కుక్కల సంతతి తగ్గించి వాటి ద్వారా వచ్చే సమస్యలను నియంత్రించడానికి స్వచ్ఛంధ సంస్థల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న స్వచ్ఛంధ సంస్థలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సంప్రదించాలని శనివారం ప్రకటన జారీ చేశారు.


ప్రార్థన చేస్తున్న బ్రదర్ మాథ్యూస్, సభలకు హాజరైన విశ్వాసులు

ఏసుక్రీస్తు... ఆదరణకర్త

● కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బ్రదర్ మాథ్యూస్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్ బోర్డు ఎదుట కృపా మినిస్ట్రీస్ 19వ అంతర్జాతీయ కృపా మహాసభలు మూడో రోజుకు చేరుకున్నాయి. కృపా మినిస్ట్రీస్ దైవజనులు నూతన గీతాలను ఆలపించి దేవుని మహిమ పరిచారు. లోకంలో ప్రజలందరూ ఆశీర్వాదకరంగా బతకాలని దేవుడు మనలను అందుకొరకే పిలిచాడని ప్రజలందరూ ఐక్యత సమాధానం కలిగి బతకాలని కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు బ్రదర్ మాథ్యూస్ సందేశమిచ్చారు. మనుషులు ఉప్పు వలే సారం కలిగే బతకాలని ఎదుటివారికి మేలుకరంగా, ఉండాలని పాస్టర్ భోగి శాంతారావు సందేశమిచ్చారు. ప్రభువు రాకడ సమీపముగా ఉందని ప్రజలందరూ ఆయన రాకడ కొరకు సిద్ధపడి ఉండాలని పాస్టర్ వినయ్ మాథ్యూస్ సందేశమిచ్చారు. ఆదివారంతో 19 మహా సభలు ముగుస్తాయని ఆయన తెలిపారు. ప్రార్థనల్లో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని ఆశీర్వచనాలు పొందారు.

కళల పూర్వవైభవానికి సీఎం శ్రీకారం

◆ తెలుగు నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ◆ ప్రారంభమైన కొండవీటి కళాపరిషత్ నాటికల పోటీలు

యడ్లపాడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన తరువాత రాష్ట్రంలో కళలకు, కళారంగానికి పూర్వవైభవం ప్రారంభమైందని, కళలపై ఆయన చూపిస్తున్న నిబద్ధత, ప్రభుత్వ స్థాయిలో తీసుకుంటున్న చర్యలు ఈ రంగానికి కొత్త శ్వాసను అందిస్తున్నదని తెలుగు నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. యడ్లపాడు మండలం లింగారావుపాలెం కొండవీటి కళాపరిషత్ జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన గోపాలకృష్ణ జ్యోతి వెలిగించగా మరో అతిథి పీపుల్స్ డ్రామా, పుడమి షైన్స్‌ల డైరెక్టర్ ముత్తవరపు అరుణకుమారిలు నటరాజ పూజచేసి తొలిరోజు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ముఖ్యమంత్రిని కళాకారులు దీనాతిదీనంగా వేడుకున్నా కళల ప్రోత్సాహకానికి, కళాకారుల సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా విదిల్చలేదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే 80మంది కళాకారులకు కళారత్న అవార్డులు అందజేయడం గొప్ప ఘట్టమని అంతేగాకుండా ఉగాది పురస్కారాలు అందజేశారని, అలాగే ఈ నెల 16న కందుకూరి పురస్కారాలను కూడా అత్యంత ఘనంగా అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందన్నారు. జిల్లా స్థాయిలో 130మందికి రూ.లక్ష


నాటిక పోటీలను ప్రారంభిస్తున్న గుమ్మడి గోపాలకృష్ణ, అరుణకుమారి

బహుమతితో అవార్డులు అందించనుండడం ఒక చారిత్రక ఘట్టం కానుందన్నారు. ఖర్చులు భరిస్తూ నాటిక పోటీలు నిర్వహిస్తున్న కళా పరిషత్‌లకు, సమాజాలకు అవసమైన మౌళిక సదుపాయాలు, ప్రభుత్వ మద్దతు లభించేలా ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించి తెలుగు నాటక అకాడమీ ద్వారా సాంస్కృతిక శాఖామంత్రి దృష్టికి తీసుకెళతామని. త్వరలోనే నాటక సమాజాల వారితో సమావేశం నిర్వహించి వారి సూచనలు, సలహాలతో ముందుకు వెళతామన్నారు. పరిషత్ అధ్యక్షులు కట్టా శ్రీహరిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులుగా పఠాన్ సుభాని, జక్కుల సుధాకర్, దండా వీరాంజనేయులు, బుద్దాల వెంకటరామారావు, జవ్వాది దాసరథి శ్రీనివాస్, ఆలోకం అమరలింగస్వామి, పరిషత్ ఉపాధ్యక్షులు తోకల సాంబశివరావు, కార్యదర్శి మండెపూడి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మహాకవి కాళిదాసు కళాప్రాంగణంలో మూడు నాటికలను ప్రదర్శితం అయ్యాయి.

బంధం బలపడితే ఏర్పడేదే 'దేవరాగం'

బంధం మనిషి నుంచి మరో మనిషికి జన్మనిచ్చిన కణబంధం. ఇది తల్లిదండ్రులకు, సంతానానికి పరిమితం. ఆ బంధం విచ్ఛిన్నమైతే తల్లిదండ్రులకు శాపం అవుతుందని, విడవకుండా కంటికి రెప్పలా కనిపెట్టుకుని ఉంటే ఆ వృద్ధాప్యమే ఆ తల్లిదండ్రులకి మధురమైన మలిదశలోని బాల్యం అవుతుందని తెలిపేదే 'దేవరాగం' నాటిక రక్తసంబంధాలు, పేగుబంధాలు, అనుబంధాలు గురించి ఎంతో అద్భుతంగా వివరించిన ఈ నాటికను సౌజన్య కళాస్రవంతి, ఉత్తరాంధ్ర వారు ప్రదర్శించిన ఈ నాటికను సలీం రచించగా కేకేఎల్ స్వామి దర్శకత్వం వహించారు.

రెండవ ప్రదర్శనగా ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారి 'కిడ్నాప్', తృతీయ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ గుంటూరువారి 'చిగురుమేఘం' నాటికలు ప్రదర్శితమయ్యాయి.

నేడు హోమియోపతి వైద్యుల రాష్ట్ర సదస్సు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంగమేశ్వరరావు, రమణరావు తదితరులు

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్స్ (ఐఐహెచ్‌పీ) రాష్ట్ర శాఖ 28వ వార్షిక సదస్సు ఆదివారం గుంటూరులో జరుగుతుందని సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పంచుమర్తి సంగమేశ్వరరావు తెలిపారు. శనివారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి రోడ్‌లోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఐఐహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఎస్ శివమూర్తి ప్రారంభిస్తారని సంగమేశ్వరరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 250 మంది హోమియోపతి వైద్యులు ఈ సదస్సులో పాల్గొంటారని ఆయన వివరించారు. సైంటిఫిక్ సెషన్‌లో చిన్నపిల్లల్లో ఆటిజం వ్యాధి చికిత్సల్లో హోమియోపతి వైద్యం పాత్ర అనే అంశంపై ముంబయ్‌కి చెందిన డాక్టర్ సమీర్ చౌకర్ ప్రసంగిస్తారన్నారు. సదస్సులో భాగంగా హోమియో వైద్యశాస్త్ర పితామహుడు డాక్టర్ హానిమన్ 270వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామని డాక్టర్ సంగమేశ్వరరావు తెలిపారు. సదస్సు ముగింపు సందర్భంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్స్ రాష్ట్ర, జిల్లా శాఖలకు నూతన కార్యవర్గ ఎన్నికలు జరుగుతాయని ఆయన వెల్లడించారు. సమావేశంలో వార్షిక సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎండీవీ రమణరావు, సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ కోదండరామిరెడ్డి, కోశాధికారి డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ పంచుమర్తి కల్పన తదితరులు పాల్గొన్నారు.


మెట్ల మార్గం వెంబడి ఏర్పాటు చేసిన శంఖు, చక్రం, నామాలు, గరుత్మంతుడు, ఆంజనేయస్వామి వార్ల విగ్రహాలు

శింగరకొండపై శంఖు, చక్రం, నామాల ఏర్పాటు

అద్దంకి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ కొండపై లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ముందు మెట్ల మార్గం పక్కన అద్దంకి పట్టణానికి నాగసూరి రామారావు, కుటుంబసభ్యులు శంఖు, చ క్రం, నామంతో పాటు గరుత్మంతుడు, ఆంజనేయస్వామి సిమెంట్ విగ్రహాలను ఏర్పాటు చేయించారు. శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నరసింహ సుదర్శన యాగం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. కొండపై మెట్ల మార్గం వెంబడి ప్రత్యేక ఆకర్షగా ఉన్నాయి.

ముంపు గ్రామాల సమస్యలను పరిష్కరిస్తా

మంత్రి రవికుమార్

అద్దంకి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామాల సమస్యలను పరిష్కరిస్తానని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అతి చిన్న గ్రామమైన తిమ్మారెడ్డిపాలెం పునరావాస కాలనీ సమస్యలను పరిష్కరించాలని మంత్రిని శుక్రవారం రాత్రి విజయవాడలో గ్రామస్థులు కలిసి కోరారు. ప్రధానంగా పునరావాసకాలనీలో ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన వాటర్ ట్యాంక్, విద్యుత్‌ను కూడా ఏర్పాటు చేయలేదని రవికుమార్ దృష్టికి తీసుకుపోయారు. గ్రామస్థులు చందలూరి రామాంజనేయులు, బత్తుల సురేష్, హరిబాబు, మోహనరావు, గాలి నారాయణ, గన్నమనేని వెంకటనారాయణ, వీరనారాయణ, చందలూరి వెంకటరావు, హరిబాబు తదితరులు మంత్రి రవికుమార్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

నేడు మంత్రి పర్యటన వివరాలు

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు చిలకలూరిపేటలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. 11 గంటలకు అద్దంకి మండలం కలవకూరు, 11-30 గంటలకు పంగులూరు మండలం ముప్పవరంలో జరిగే కార్యక్రమాలకు మంత్రి రవికుమార్ హాజరుకానున్నారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు ఉండవల్లిలో ఉంటారు.

అన్ని దానాల్లో అన్నదానం మిన్న


చీరాల ఏరియా వైద్యశాలలో అన్నదానం చేస్తున్న సూపరింటెండెంట్ సుభాషిణి, దాతలు

చీరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.సుభాషిణి అన్నారు. శనివారం ఈపూరుపాలెంకు చెందిన బూదాటి సాంబశివరావు, నాగలక్ష్మి దంపతులు కుమారుడు జగదీష్ పుట్టిన రోజు సందర్భంగా హాస్పిటల్లో రోగులకు, అటెండర్‌లకు సుమారు 120 మందికి అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాస్పిటల్ సూపరిండెంట్ డా.సుభాషిణి పాల్గొని అందరికి ఒడ్డన చేశారు. దాతలు శుభకార్యాలప్పుడు వ్యయాన్ని వృథా చేయకుండా అన్నదానాలు నిర్వహించడం అభినందించదగిన అంశమని కొనియాడారు. కార్యక్రమంలో పూర మస్తాన్‌రావు, చైతన్య మనో వికాసం ప్రతినిధి వెంకన్నబాబు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు


డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు నుంచి జ్ఞాపికను అందుకుంటున్న ఏపీఎం జ్యోతి ప్రసాద్

పంగులూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో శ్రీనిధి రుణాల మంజూరు, రికవరీలో ఉత్తమ ఫలితాలు సాధించిన జె.పంగులూరు వెలుగు సిబ్బందిని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు అభినందించారు. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎం జ్యోతి ప్రసాద్‌కు జ్ఞాపికను ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో సీసీలు సాల్మాన్, చంద్రశేఖర్, సురేష్ పాల్గొన్నారు.

గవినివారిపాలెం హైస్కూల్లో డిప్యూటీ ఈవో తనిఖీలు

» పలు వ్యత్యాసాల గుర్తింపు » హెచ్‌ఎంకు మెమో


రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో గంగాధర్

గవినివారిపాలెం(చీరాల), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గవినివారి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం డిప్యూటీ ఈవో గంగాధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పిల్లల అటెండెన్స్‌లో 12 మంది వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే స్టాఫ్ రివ్యూ మీటింగ్, ఆపార్ ఐడీ సమస్యల రికార్డులు సక్రమంగా లేకపోవడంతో తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈక్రమంలో ప్రధానోపాధ్యాయునికి మెమో జారీ చేస్తున్నట్లు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

అద్దంకి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాయపాలెం శివారు ప్రాంతంలో పేకాట శిబిరంలో శనివారం పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని రూ.2వేలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రవితేజ తెలిపారు.

గాలింపులో గందరగోళం

» పలు కేసుల్లో నిందితుడి కోసం తెలంగాణ నుంచి వచ్చిన పోలీసులు
» శుక్రవారం రాత్రి వాడరేవులోని గెస్ట్ హౌస్ సమీపంలో రక్తపు మరకలతో ఉన్న పాత నేరస్థుడు
» ఎస్సైలు, ఐడీ పార్టీ కానిస్టేబుల్‌పై ఆరోపణల వీడియో వైరల్
» బాపట్ల వైద్యశాలలో చికిత్సకు చేరి అక్కడ నుంచి పరార్
» అసలు ఏం జరిగింది ? మహేష్ ఎక్కడున్నాడు ? అనే కోణంలో దర్యాప్తు

చీరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పలు కేసుల్లోని నిందితుడు కోసం తెలంగాణకు చెందిన పోలీసులు గాలింపు నిర్వహించగా గందరగోళ వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని ఈపూరుపాలెం పద్మనాభునిపేటకు చెందిన ఆరికాటి మహేష్‌పై ఇప్పటికే ఈపూరుపాలెం, వేటపాలెం, చీరాల వన్‌టౌన్‌తో పాటు తెలంగాణలో కూడా పలు కేసులు ఉన్నాయి. ఆయా పోలీసులకు ఇప్పటికే వాంటెడ్ నిందితుడు. ఈక్రమంలో ఇతడిని, ఇతనితో పాటు మరి కొందరిని పట్టుకునేందుకు శుక్రవారం రాత్రి తెలంగాణకు చెందిన పోలీసులు చీరాలకు వచ్చారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు చెందిన పోలీసుల వాహనాలు కూడా శుక్రవారం రాత్రి వాడరేవు తీరం వైపు ఓ గెస్ట్ హౌస్ సమీపంలో తిరిగినట్లు సమాచారం ఉంది. ఇదిలావుండగా ఏమి జరిగిందో తెలియదు గానీ సుమారు ఏడు గంటల సమయం నుంచి ఇసుక దిబ్బల్లో మహేష్ రక్తపు వస్త్రాలతో పడుకుని తనపై ఈపూరుపాలెం ఎస్సై, వేటపాలెం ఎస్సైతో పాటు మరి ముఖ్యంగా ఐడీ పార్టీకి చెందిన వారు దాడిచేసి గాయపరిచారని చెప్తున్న వీడియో వైరల్ అయింది. అందులో మహేష్ ఎస్సైల పేర్లు మాత్రం చెప్పలేక పోయాడు.

పరారీకి పక్కా ప్లాన్

ఇదిలావుంటే ఇతడికి బాపట్ల వైద్యశాలలో ఎవరో చేర్పించి మరలా ప్రథమ చికిత్సను అందించి అక్కడా కూడా వీడియో తీసి వైరల్ చేశారు. అక్కడా కూడా మహేష్ అదే పేర్లను పదేపదే చెప్పాడు. చికిత్స


రక్తపు మరకలు అంటిన వస్త్రాలతో పాత నేరస్థుడు మహేష్


బాపట్ల ప్రభుత్వాసుపత్రి నుంచి పారిపోయే ముందు చికిత్స పొందుతున్న మహేష్

జరుగుతుండగానే మహేష్ అక్కడి వైద్యుల కళ్లుగప్పి పరారయ్యాడు. ఈనేపథ్యంలో వైరల్ అయిన రెండు వీడియోలతో ఒక్కసారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులతో పాటు మొత్తం నియోజకవర్గ పరిధిలోని పోలీసు వ్యవస్థ సైతం అవాక్కయింది. వీడియోలు తీసిన వ్యక్తి ఎవరు.. గాయపడిన మహేష్ ఎక్కడ.. అసలు ఈ ముగ్గురి పేర్లే ఎందుకు చెప్తున్నాడు వంటి వాటిపై పోలీసు అధికారులు దర్యాప్తు చేపట్టారు. అయితే చికిత్స అందించిన వైద్య సిబ్బంది మాత్రం అతడి చొక్కాకు అంటిన మరకలకు శరీరంపై ఉన్న దెబ్బలకు పొంతన లేదని చెప్తున్నారు. అసలు అవి తగిలిన దెబ్బలా ? లేక సృష్టించిన దెబ్బలా? తెలియాలి. లేక నిజమైన దెబ్బలే అయితే గాయాలతో ఉన్న మహేష్ ఎక్కడున్నాడు? చికిత్స ఏమైంది? పరారయ్యేందుకు పక్కా ప్లాన్ వేశాడా అనే సందేహాలను పోలీసులు తేల్చాలి. పోలీసులు మాత్రం ఇతనిపై కేసులు ఉన్న నేపథ్యంలో ఏక్షణంలోనైనా అదుపులోకి తీసుకుంటామన్న ముందస్తు ఆలోచనతో అతనే ఈవిధంగా గాయాలు సృష్టించుకుని పరారైనట్లు పోలీసులు స్పష్టంగా చెప్తున్నారు. రెండు రోజులుగా చీరాలలో గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటన ఒకవైపు, మరో వైపు పోలీసులపై ఆరోపణలతో కూడిన వీడియోల వైరల్‌తో పోలీసులకు తల బొప్పి కట్టింది. అంతేకాకుండా మరో ముఖ్యమైన విషయమేమిటంటే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఎస్సైలు గవర్నర్ ప్రొటోకాల్‌లో ఉన్నట్లు అధికారులు స్పష్టంగా తెలిపారు. అయితే శనివారం సాయంత్రానికి ప్రశాంతంగా గవర్నర్ రెండు రోజుల పర్యటన ముగసింది. ఇక మహేష్ వీడియోలకు ఏ విధంగా ముగింపు పలుకుతారో చూడాలి.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

మార్టూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని కోలలపూడి అంగనవాడీ కేంద్రంలో సూపర్ వైజరు కే పద్మ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమం తం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎంసతీష్ కుమార్,అంగనవాడీ టీచర్లు కవిత, సువర్ణలత, పద్మ, సుధ పాల్గొన్నారు.

నేత్రాల దానం

ఇంకొల్లు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో నేత్రదానం జరిగింది. గొనసపూడి గ్రామానికి చెందిన విక్రం సరస్వతమ్మ శుక్రవారం మృతి చెందగా కుటుంబ సభ్యులు వెంకట్రావు, నారాయణ, అజయ్‌బాబు, సందీప్ సహకారంతో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు ఆమె నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు రామ్మోహనరావు, జెట్టి స్వామి అభినందించారు.

కేజీబీవీ విద్యార్థినుల సత్తా

చినగంజాం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులు ఇంటర్‌లో సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 33 మంది పరీక్షలు రాయగా, 28 మంది పాసై 84.8 శాతం, సీనియర్ ఎంపీసీలో 31 మందికి గాను 29 మంది ఉత్తీర్ణతతో 93.5శాతం సాధించినట్లు తెలిపారు. సీనియర్ ఎంపీసీలో డి.దీప్తి 940, మౌనికాంజలి 935, కావ్య 900, మొదటి ఎంపీసీలో జె.హర్షిత 448, జి.అభినయ 439, సాయిపూజిత 429, వి.ధరణి 424, వై.సౌమ్య 420, నాగమణి 412, రసజ్ఞ 407, చినమాధురి 405, రుక్మిణి 404 మార్కులు సాధించినట్లు తెలిపారు.

భూమన కరుణాకరరెడ్డివి అసత్యప్రచారాలు

» టీటీడీ గో మరణాలపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు
» ఖండించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి టీటీడీ గో మరణాలపై అసత్య ప్రచారాలు చేస్తూ మత విద్వేషాలకు రెచ్చగొడుతూ ప్రజల మనో భావాలను దెబ్బతీస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఇటీవల భూమన చేసిన వ్యాఖ్యలపై శనివారం ఎమ్మెల్యే స్పందించారు. గోశాలలో 100 గోవులు మృతి చెందినట్లు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. భూమన మీడియాలో ప్రదర్శించిన ఫొటోలు తిరుమలలోవి కావన్నారు. భూమన కొవిడ్‌లో సైతం స్వామి ప్రసాదాలు దారి మళ్లించి పాపం మూట గట్టుకున్నారని ఆరోపించారు. మతాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు చెప్పారు. అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని తిరుమల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే కొండ య్య ఓ ప్రకటనలో తెలిపారు.

విజయ ఢంకా మోగించిన శ్రీ గౌతమి కళాశాల


యోగనాథ్ 988 | జయదుర్గ 988 | చంద్రిక 434

చీరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : సీనియర్, జూనియర్ ఇంటర్ ఫలితాల్లో చీరాల శ్రీ గౌతమి కళాశాల విజయ ఢంకా మోగించింది. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ విద్యార్థులు యోగానంద్, జయదుర్గ 988 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కార్తీక్ 987, యామిని 985 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో చంద్రిక 434, స్నేహిత 433 మార్కులు సాధించారు. ఎంపీసీలో సాహితి, పూర్ణ పృథ్వీ 465, చంద్రిక గీతిక రిజ్వానా, చరిత, కౌషీత్ 464 మార్కులు పొందారు. దీంతో కళాశాల మేనేజింగ్ డైరక్టర్ ఎం.వెంకటేశ్వర్లు(ఎంవీ), అధ్యాపకులు, సిబ్బంది వీరిని ప్రత్యేకంగా అభినందించారు.

డ్రీమ్జ్ విద్యార్థుల ప్రతిభ

ఇంకొల్లు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : శనివారం విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో పూసపాడు అడ్డరోడ్డు డ్రీమ్జ్ విద్యా ర్థులు అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభకనబరిచినట్లు కళాశాల డైరెక్టర్ పేర్ని రాధాకృష్ణమూర్తి తెలిపారు. మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను పి.సాయిహర్షితరెడ్డి, బి.దీపక్‌రెడ్డి 465 మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు జె.పావనిశ్రీ 989 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో ప్రతిభ చూపిన విద్యార్థులు, అధ్యాపకులను పేర్ని రాధాకృష్ణమూర్తి అభినందించారు.


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్, యువ నాయకుడు గౌరీఅమర్‌నాథ్

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

చీరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రప్రదేశ్) : గొల్లపాలెంలోని మహాలక్ష్మి అమ్మవారు, గంగమ్మతల్లి అమ్మవార్లకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్, యువ నాయకుడు గౌరీనాథ్ పాల్గొన్నారు. సమీపంలోని పోతురాజు స్వామికి జరిగిన వెండి తొడుగు ఉత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు ఘన స్వాగతం పలికారు. అర్చకులు ఆశీర్వ వచనాలు అందించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వామివార్ల తిరునాళ్ల


ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

ఉప్పుటూరు (పర్చూరు), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలంలోని ఉప్పుటూరు గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర, శ్రీచెన్నకేశవ స్వామివార్ల తిరునాళ్ళ వేడుకలు శనివారం భక్తులు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లకు మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కోలాటం, భజన కార్యక్రమాలు, చింతామణి నాటిక, చిన్నారులచే కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేపట్టారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి దామా నాగేశ్వరరావు, వంశం పారంపర్య అర్చకర్తల సారథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై మాల్యాద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేసి పర్యవేక్షించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పర్చూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నేడు శంకర్ కంటి అసుపత్రి పెదకాకాని, చిన్నయ మిషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలోఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పాబోలు ఉదయభాస్కర్ శనివారం ప్రకటనలో తెలిపారు. విద్యా దాత పాబోలు రాధాకృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన గవర్నర్ పర్యటన

చీరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతుల రెండ్రోజుల పర్యటన శనివారంతో ప్రశాంతంగా ముగిసింది. వాడరేవు ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో శుక్ర, శనివారం బస చేసిన గవర్నర్‌ను శనివారం ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం గవర్నర్‌ను సాయంత్రం అధికారులు సాదరంగా సాగనంపారు. ఆయన విజయవాడ రాజభవన్‌కు పయనమయ్యారు.

హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన

సీనియర్ విభాగంలో సత్తాచాటిన గుంటూరు జిల్లా గిత్తలు

ఉప్పుటూరు (పర్చూరు), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి పోలు రాధా ఎడ్ల బలప్రదర్శన పోటీలు పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు గ్రామంలో హోరాహోరీగా సాగుతున్నాయి. శ్రీ వేంకటేశ్వర చెన్నకేశవ స్వామివార్ల తిరునాళ్ల సందర్భంగా రెండు రోజుల పాటు (సీనియర్, జూనియర్ విభాగాల్లో) పోటీలకు ఏర్పాట్లు చేశారు. శనివారం జూనియర్ విభాగంలో నిర్వహించిన ఎడ్ల బల ప్రదర్శనలో ఆయా జిల్లాల నుంచి 18 జతల ఎడ్లు పోటీలో తలపడనున్నాయి. ఫ్లడ్ లైట్‌ల మధ్య పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. పెద్ద సెంఖ్యలో పశుపోషకులు, అభిమానులు తరలివచ్చారు. కమిటీ నిర్వహకులు ముప్పా అంజయ్య, కొమ్మనబోయిన రాఘవయ్య, కాల్వ అమర్‌నాథ్, వెల్లటూరి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


ఎడ్ల బల ప్రదర్శనలో తలపడుతున్న ఒంగోలు జాతి గిత్తలు

సీనియర్‌లో సత్తా చాటిన గుంటూరు జిల్లా ఎడ్లు

సీనియర్ విభాగంలో నిర్వహించిన పోటీలో గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్య ఎడ్లు 2728.1 అడుగు దూరం లాగి రాష్ట్ర స్థాయి పోటీలో మొదటి బహుమతి రూ.55,000ను కైవసం చేసుకున్నాయి. బాపట్ల జిల్లా, పగడంవారిపాలెంకు చెందిన వేద శ్రీలత ఎడ్లు 2552.5 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతి రూ.35,000 కైవసం చేసుకున్నాయి. మూడవ బహుమతిని బాపట్ల జిల్లా, ఆవులదొడ్డి కొత్తపాలెం గ్రామానికి చెందిన సాయిదీపిక చౌదరి ఎడ్లు 2408.9 అడుగుల దూరం లాగి రూ.20,000 నగదును సొంతం చేసుకున్నాయి.

భగభగ .. వడగండ్ల వాన

» పలుచోట్ల 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు
» రాష్ట్రంలోనే అత్యధికంగా నమోదు
» సాయంత్రం చల్లబడి జల్లులు
» పీసీపల్లిలో వడగండ్ల వాన
» మరింతగా ఎండలు పెరిగే అవకాశం

ఒంగోలు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం భానుడు భగభగలాడాడు. ఈ ప్రాంతం, ఆ ప్రాంతం అని తేడా లేకుండా అన్నిచోట్ల ఎండలు మండిపోయాయి. పలుచోట్ల 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా అత్యధిక ప్రాంతాల్లో 40డిగ్రీలకు పైగా ఉన్నాయి. ఎండలకు తోడు వేడిగాలులు కూడా మొదలయ్యాయి. అదే సమయంలో సాయంత్రం సమయానికి వాతావరణం చల్లబడటంతోపాటు పలుచోట్ల జల్లులు కూడా పడ్డాయి. ఏకంగా పీసీపల్లి మండలంలో వడగండ్ల వాన కురిసింది. గత నెల ఆఖరు నుంచే జిల్లాలో ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. అయితే శనివారం ఒక్కసారిగా ఉష్ణోగ్రతల తీవ్రత పెరిగింది. ఉదయం 10గంటల నంచే ఎండ మండింది. అలా మధ్యాహ్నం 12 గంటలకే చాలాచోట్ల 39 నుంచి 40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా సాయంత్రం 4 గంటల వరకు ఆ తీవ్రత కొనసాగింది. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల సమయంలో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదయ్యాయి. మధ్యాహ్నం 12 గంటల సమయానికి రాష్ట్రంలో అత్యధికంగా మర్రిపూడి మండలం జువ్విగుంటలో 40.28 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా 1 గంట సమయంలో వైపాలెం మండలంలో గోళ్లవిడిపిలో రాష్ట్రంలో కెల్లా అత్యధికంగా 41.33 డిగ్రీలు నమోదైంది.

దరిమడుగులో 42.90 డిగ్రీలు

మధ్యాహ్నం 2 గంటల సమయంలో రాష్ట్రంలో ప్రభుత్వం ఉష్ణోగ్రతలు నమోదు చేసే 1,599 సెంటర్లలో 33చోట్ల 41 డిగ్రీలుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా అందులో ఐదు సెంటర్లు జిల్లాలోనే ఉన్నాయి. ఆ సమయంలో తర్లుపాడులో గరిష్ఠంగా 41.30 డిగ్రీలు నమోదైంది. సాయంత్రం ఐదు గంటల వరకు పలు ప్రాంతాల్లో ఇదే తరహాలో ఎండలు ఉండగా మార్కాపురం మండలంలోని దరిమడుగులో సాయంత్రం 4 గంటల తర్వాత కూడా 42.90 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం ఎండ తీవ్రతను తెలియజేస్తోంది. ఇక జిల్లా కేంద్రమైన ఒంగోలులోనూ శనివారం


కమ్మవారిపల్లిలో వేపచెట్టు విరిగిపడడంతో తెగిపోయిన విద్యుత్ తీగలు

ఎండమండింది. ఈ సీజన్‌లో తొలిసారిగా శనివారం 41.80 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. శుక్రవారం కన్నా శనివారం ఏకంగా 4 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగానే కనిపించింది. ఇక ఎండలకు తోడు వేడిగాలులు కూడా జిల్లా అంతటా ప్రారంభమయ్యాయి. ఇదిలా ఉండగా సాయంత్రం 4 గంటల సమయానికి కొన్ని ప్రాంతాల్లో వాతావరణం చల్లబడింది. మబ్బులు కమ్మి చల్లగాలులు వీయగా కొన్నిచోట్ల జల్లులు పడ్డాయి. పీసీపల్లి మండలంలో ఏకంగా వడగండ్ల వాన పడగా ఇతర ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. ఆదివాంరం నుంచి ఎండలు మరింత పెరిగే అవకాశం ఉంది.

నైట్ షెల్టర్‌లు కరువు

» అవస్థల్లో ప్రజలు
» రాత్రయితే గుండెల్లో గుబులు
» కునుకు కోసం కష్టాలు


పట్టణంలో రహదారి వెంబడి నిద్రిస్తున్న నిరాశ్రయులు

చీరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఏళ్ల తరబడి నైట్ షెల్టర్‌ల నిర్వహణ అటకెక్కింది. ఇతర ప్రాంతాల నుంచి వివిధ రకాల పనులు నిమిత్తం వచ్చిన ప్రజలు, రోజంతా యాచన సాగించి విశ్రమిం చేందుకు తావులేని బిచ్చగాళ్ల రాత్రి వేళల్లో కాసింత కునుకు తీసే పరిస్థితి లేక బతుకు జీవుడా అంటున్నారు. వర్షాకాలంలో తడు స్తూ, విడి రోజుల్లో దోమలతో రాత్రంతా జాగారం చేస్తున్నారు. గతంలో మున్సిపల్ కౌన్సిల్ సమా వేశంలో ఈ అంశాన్ని చర్చించి తీర్మానం చేశారు. ఈనేపథ్యంలో ముందు ఒక ప్రదేశం, తరువాత మరో ప్రదేశాన్ని షెల్టర్ ఏర్పాటకు పరిశీలించారు. అయితే ఆ ప్రాంతా ల్లోని ఇరుగు పొరుగు వారు అభ్యంతరాలు తెలుప డంతో అది కాస్త అప్పట్లో వాయిదా పడింది. కాలక్ర మేణా ఆ విషయాన్ని పాలకులు, అధికారులు పూర్తిగా గాలికి వదిలేశారు. దీం తో ఇతర ప్రాంతాల నుంచి చీరాలకు వచ్చి రాత్రిళ్ల వాహన సౌకర్యం లేక ఇరుక్కు పోయిన వారు, యాచకులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. అధికారులు ఈ సారైనా నైట్ షెల్టర్‌ల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య



నైట్ షెల్టర్ ఏర్పాటుకు ఇప్పటికే ప్రపోజల్స్ పంపిం చాం. ఉన్నతాధికారుల ఉత్త ర్యుల కోసం వేచి చూస్తు న్నాం. వైలనంత త్వరగా షె ల్టర్‌ను ఏర్పాటు చేసి సమ స్యను పరిష్కరిస్తాం.

- అబ్దుల్ రషీద్,
చీరాల మునిసిపల్ కమిషనర్



శింగరకొండలో వైభవంగా లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో చైత్ర పౌర్ణమి, హనుమ ద్విజయోత్సవం సందర్భంగా శనివారం లక్ష తమల పాకుల పూజ వైభవంగా జరిగింది. సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం, అనంతరం స్వామి వారికి అభి షేకం నిర్వహించారు. వేదపండితులు, పూజారులు 11 ఆవృత్తములుగా లక్ష తమలపాకులతో ప్రసన్నాంజనేయ స్వామికి ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలుగా చిలకలూరిపేటకు చెందిన డీఆర్ ఎన్ఎస్‌సీవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, కుటుంబసభ్యులు పాల్గొ న్నారు. శనివారం, హనుమద్విజయోత్స వము కలిసి రావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ప్రసన్నాంజనేయున్ని దర్శిం చుకొని పూజలు నిర్వహించారు.

వేసవి ముగిసే లోపు పంట కాలువలకు మరమ్మతులు

» వ్యవసాయం లాభసాటిగా మారుస్తాం
» వైసీపీ పాలనలో గుండ్లకమ్మలో ఇసుక దోపిడీ
» మంత్రి గొట్టిపాటి


రైతులతో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

బల్లికురవ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : వేసవి ముగిసేలోపు పంట కాలువలను మరమ్మతులు చేయిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. శనివారం ఆయన నీటి సం ఘాల అధ్యక్షులతో మాట్లాడారు. గత వైసీపీ పాల నలో రైతులు తీవ్రం గా నష్టపోయారని కూటమి ప్రభుత్వం రాగానే గుండ్లకమ్మ ప్రాజెక్టులో 3 టీ ఎంసీల నీటిని నిల్వ చేసేలా చర్య లు చేపట్టామని పేర్కొ న్నారు.

గ్రామాల్లో ఉన్న సాగు నీటి మేజర్లు, పంట కాలవలను పూర్తి అభివృద్ధి చేయాలన్నారు. ఎక్కడా రైతులకు సాగు నీటి ఇబ్బం దులు లేకుండా చేయాలన్నారు. వైసీపీ పాలకులు రైతులకు నీటిని అందించకుండా ఇసుక దోపిడీ కోసం గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు కొట్టుకుపోయేలా చేశారని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాగానే పడి పోయిన గేటును ఏర్పాటు చేసి 20 లక్షల చేప పిల్లలను వేయించామని తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిధిలో నిరుపేదలకు జీవనో పాధి కల్పించామన్నారు. రానున్న వ్యవసాయ సీజ న్ ప్రారంభం నాటికి పూర్తి స్థాయిలో మరమ్మతు లకు గురైన ఎత్తిపోతల పథకాలను వినియెగంలోకి తీసుకు వస్తామని తెలి పారు. రైతులు దగ్గర ఉండి కాలవల మర్మమ్మతు లను చేయించు కోవాలని మంత్రి కోరారు.

ఇంటర్‌లో ప్రభుత్వ కాలేజీల విద్యార్థుల ప్రతిభ

చీరాలకు జిల్లా స్థాయిలో మొదటి స్థానం

చీరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరానికి సంబంధించిన ఫలితాలను ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. ఈక్రమంలో సీనియర్ ఇంటర్‌లో చీరాల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కె.ధాత్రి శ్రీ 975 మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానం సొంతం చేసు కుంది. ఒకేషనల్ జనరల్ కోర్సులో అదే కళాశాలకు చెందిన బీ అనూష 977 సాధించి ఉత్తమంగా రాణించింది. ఈక్రమంలో చిన్నారులను పలువురు అభినందించారు.

అద్దంకిటౌన్ : అద్దంకిలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎం. సంజనా 961, సీనియర్ బైపీసీలో స్వరూపరాణి 967 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రి దేవి తెలిపారు. సీనియర్ ఎంపీసీలో 6 గురు, సీనియర్ బైపీసీలో 10 మంది 900 మందికి పైగా మార్కులు సాధించినట్లు తెలి పారు. జూనియర్ ఎంపీసీలో పి.స్పందన 459, జూనియర్ బైపీసీలో గీత 428 సాధించినట్లు చెప్పారు.

బల్లికురవ : ఇంటర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించిన్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 73 శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో నూరు శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు తెలిపారు. ప్రథమ ఎంపీసీ విభాగంలో షేక్ ముస్రీ 430 మార్కులు, బైపీసీలో కె.కుమారి 406 సీఈసీలో తరుణ్‌తేజ 356 సాధించా రు. సెకండ్ ఇంటర్ ఎంపీసీలో సరిత 912 మార్కులు, బైపీసీలో కరుణ 825, సీఈసీలో క్రాంతిపాల్ 849 మార్కులు సాధించారు. కస్తూర్బా గాంధీ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థినులు 74 శా తం, సెకండ్ ఇయర్ 85 శాతం మంది ఉత్తీర్ణులయ్యా రని ప్రిన్సిపాల్ సరళకు మారి తెలిపారు.

పంగులూరు : బూద వాడ ఉన్నత పాఠశాల ప్లస్ టూలో సీనియర్ ఇంటర్ బైపీసీ విద్యార్థిని షేక్ షాదీజ 833 మా ర్కులు, మరో విద్యార్థిని నజ్మా వెయ్యికి 712 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్‌లో 70 శాతం, జూనియర్ ఇంట ర్‌లో 85 శాతం ఉత్తీర్ణత సాధించారు.

మార్టూరు : ఇంటర్ ఫలితాల్లో మా ర్టూరులోని రాయల్ జూనియర్ కాలే జీకి చెందిన సీనియర్ ఇంటర్ విద్యార్థి ఎం పీసీ గ్రూపునకు చెందిన ఓబుల శెట్టి దిలీ ప్ 1000 మార్కు లకు గాను 989 మా ర్కులు సాధించి మండ లంలో మొదటి స్థానాన్ని పొందారు.అదేవిధంగా శ్రీహర్షిణి జూనియర్ కాలే జీకి చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి హృదయబాబు ఎంపీసీలో 465 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానాన్ని సాధించాడు.

పర్చూరు : ఇంటర్‌లో బాలికలు సత్తా చాటారు. ప్రభుత్వ బీఏఆర్ అండ్ టీఏ కళాశాలకు చెందిన 38 మందికి గాను 21 మంది ఉత్తీర్ణత సాధించి నట్లు ప్రిన్సిపాల్ శేషకు మారి తెలిపారు.


మార్టూరు శాఖ విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం

విశ్రాంత ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం

మార్టూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు శాఖ విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గ ఎంపిక శనివారం విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగింది. ఏక గ్రీవంగా జరిగిన కార్యవర్గం ఎంపికలో అధ్య క్షునిగా కొరిటాల రామారావు, ప్రధాన కార్యదర్శిగా మద్దుమాల శ్రీని వాస చిట్టిబాబు, కోశాధికారిగా పొందూరు దేవకి నందన వెంకటేశ్వర రావుతోపాటు 13 మంది కార్యవర్గసభ్యులును ఎంపికచేశారు. ఎన్నికల అధికారిగా యర్రగుంట కృష్ణమూర్తి, సహాయ ఎన్నికల అధికారిగా యూవీ గోపాలరావు, జిల్లా ఎన్నికల పరిశీలకులుగా టీ మురళీధర రావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ 2 అధ్యక్షులు రావుల బాపయ్య, షేక్ కమాలుద్దీన్, కరణం లక్ష్మయ్య పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

బల్లికురవ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం గ్రామంలోని వీర బ్రహ్మేంద్రస్వామి వార్షిక కల్యాణం శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన భక్తులు దేవాలయం వద్ద కల్యాణ వేడుకలను నిర్వహించారు. కల్యాణం నిర్వ హించే పురోహితులు వీర బ్రహ్మేంద్ర స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్ర ప్రకారం జరిపించారు. ఈసందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకుంది. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు.

వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా రవికుమార్



చినగంజాం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని గొనసపూడి గ్రామానికి చెందిన మాచవ రపు రవికుమార్ వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. వైసీపీ అధినేత, జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ స్థానం కల్పించినట్లు రవికుమార్ శనివారం తెలిపారు. గ తంలో రాష్ట్ర కార్యదర్శిగా, పర్చూరు నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పనిచేసినట్లు తెలిపారు. అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, బాపట్ల పార్లమెంట్ వైసీపీ ఇన్‌చార్జి నందిగం సురేష్, పర్చూరు నియో జనవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదన్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్య క్షుడు పానుగంటి చైతన్యకు రవికుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

కుటుంబ కలహాలతో చేయి కోసుకున్న వ్యక్తి

అద్దంకి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి చేయి కోసుకున్న ఘటనల అద్దంకి పట్టణంలోని గరటయ్య కాల నీలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గరటయ్య కాలనీకి చెందిన సంజీవరావు శనివారం చేయి కోసుకున్నాడు. 108 సిబ్బంది సంజీవరావును అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స అనంతరం సంజీవరావు కమతేశ్వరస్వామి దేవాలయం సమీ పంలో నామ్ రోడ్డు వెంబడి పడుకొని ఉండడంతో స్తానికులు 108 కు సమాచారం అందించారు. వెళ్లి చూడగా సంజీవరావు కావడంతో 108 సిబ్బంది వెనుదిరిగి వచ్చారు.

రైలు ఢీకొని వివాహిత మృతి

ఈపూరుపాలెం (చీరాల), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాలు దాటుతున్న వివాహితను రైలు ఢీకొనడంతో ఆమె మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి మండల పరిధిలోని ఈపూరుపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లావణ్య(27) చూడకుండా పట్టాలు దాటుతుంది. ఈక్రమంలో ప్రమాదానికి గురైంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి శనివారం పోస్ట్ మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఉరుసు వేడుకల వద్ద ఘర్షణ

ఇద్దరికి గాయాలు

మార్టూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కొణిదెన రోడ్‌లో ఉరుసు వేడుకలు జరుగుతున్న సమయంలో కొంతమంది వ్యక్తుల మధ్య ఘర్షణ జరిగింది. 15 రోజుల కిందట మండలంలోని వలపర్లలో జరి గిన ఆంజనేయస్వామి తిరునాళ్ల సమయంలో వారి మధ్య గొడవ జరి గినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అప్పటి గొడవలను దృష్టిలో పెట్టుకొని మరలా వారు మార్టూరులో గొడవ పడినట్లు తెలిసింది. ఈ గొడవలో మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన షేక్ గాలిబ్‌షా, అనిల్ అనే ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి వారిని పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.. మార్టూరు గ్రామానికి చెందిన సుభాని, మణితోపాటు కొంతమంది వ్యక్తులు తమపై కర్రలతో, చెరుకు గడలతో దాడి చేసి గాయపరచినట్లు సాయంత్రం ఆస్పత్రి నుంచి వచ్చిన ఇద్దరు బాధితులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎం.శేషగిరి రావు విచారణ చేస్తున్నారు.